సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి: 17 | సంచిక: 174
పేజీలు: 08 | వెల: రూ.2:00

విజయవాడ | మంగళవారం 23 జూన్ 2026

Published from Vijayawada, Hyderabad.

## భారత్ అభివృద్ధిని చూసింది

- విధ్వంసాన్ని కూడా ఎదుర్కొంది
- క్షణిక సంఘటనలతో అస్థిరపడిపోం
- వెయ్యేళ్ల భవిష్యత్తుకు పునాది వేస్తున్నాం
- భారత ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,జూన్22(సాక్ష్యం): భారతదేశం కేవలం ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ మాత్రమే కాదు ప్రపంచానికి నమ్మకమైన భాగస్వామిగా, విశ్వసనీయ శక్తిగా అవతరించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ప్రపంచ సరఫరా గొలుసులు, సాంకేతికత, పెట్టుబడులు, వ్యూహాత్మక భాగస్వామ్యాల్లో భారత్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకం పెరుగుతోందన్నారు. రిపబ్లిక్

మిగతా 2 లో..



## బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత

**దేశ ప్రధాని కీర్ స్టార్మర్ పదవికి రాజీనామా**

లండన్,జూన్22(సాక్ష్యం): బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత నెలకొంది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. తాజా పరిణామంతో బ్రిటన్‌లో దశాబ్ద కాలంలో తమ పదవులకు రాజీనామా చేసిన

మిగతా 2 లో..



## ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

**రైతుల ప్రయోజనాలు కాపాడి తీరుతాం**

**అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష**

హైదరాబాద్,జూన్22(సాక్ష్యం): తెలంగాణ హక్కుల పరిరక్షణెళి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

మిగతా 2 లో..



## వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

**రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్,జూన్22(సాక్ష్యం): రాష్ట్రంలో వర్షాకాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడంతో పాటు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాలకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు సమీక్ష నిర్వహించి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల

మిగతా 2 లో..

# అభివృద్ధికి సహకరించండి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన రైల్వేమంత్రితో రైల్‌భవన్‌లో సమావేశం అయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతుల అంశంపై ఆయనతో చర్చించారు. ఐఆర్‌ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్షించినట్లుగా సమాచారం. ఇటీవల కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖను రాసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరంలో మెట్రో రైలుకు ఐఆర్‌ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేవిధంగా చూడాలని లేఖలో కోరిన విషయం తెలిసిందే. రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే ముగ్గురు సమావేశం అవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.



- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం
- దేవరకద్ర డిఆర్‌ఎస్ ప్రాజెక్ట్ సత్వరం చేపట్టాలి
- కార్గో, హ్యాంగర్ సేవలకు సహకరించండి
- హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ అనుకూలం
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత సౌలభ్యం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో సీఎం రేవంత్ భేటీ
- రక్షణ భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు

న్యూఢిల్లీ,జూన్22: ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని సిఎం రేంవత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా

మిగతా 2 లో..



## కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సిఎం భేటీ

**కిషన్ రెడ్డితో కలసి వెళ్లిన సీఎం రేవంత్**

**మెట్రో రెండోదశ విస్తరణపై చర్చ**

**ఐఆర్‌ఎఫ్‌సీ లోన్‌పై ప్రధాన చర్చ**

**రూ. 13,600 కోట్ల విడుదలపై వినతి**

**నేడు కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీ**

**మెట్రో ఫేజ్-2 విస్తరణపై చర్చలు**

**నిధుల మంజూరుపై చర్చించే చాన్స్**



న్యూఢిల్లీ,జూన్22 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి రైల్వేమంత్రితో రైల్ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 అనుమతులపై వారు చర్చించారు. ఐఆర్‌ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలపైనా నేతలు సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల కిషన్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలుకు ఐఆర్‌ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. రైల్వేమంత్రితో భేటీ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ క్రమంలో తాజా సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ టేకోవర్, మెట్రో ఫేజ్ 2 విస్తరణ, ఐఆర్‌ఎఫ్‌సీ పెండింగ్ నిధులు గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు.

మిగతా 2 లో..



## మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

**డ్రోన్‌లతో వరుస దాడులతో రష్యా ఉక్కిరిబిక్కిరి**

మాస్కో,జూన్22(సాక్ష్యం): రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దాని పరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త

మిగతా 5 లో..

## భూపాలపల్లి జిల్లాలో దుర్ఘటన

**వాహనాలు తనిఖీ చేస్తుండగా దూసుకొచ్చిన లారీ**

**డిటివో వెంకన్న అరక్కడిక్కడే మృతి**

జయశంకర్ భూపాలపల్లి,జూన్22(సాక్ష్యం): జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం మండలం చెల్పూరు శివారులో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. రవాణా శాఖ కార్యాలయం ఎదుట జిల్లా రవాణా అధికారి డీటీఓ

మిగతా 5 లో..



# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపి

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా కృషి**

**ఎపి రూపురేఖలు మార్చేలా చంద్రబాబు వేగంగా అడుగులు**

**ఢిల్లీ సదస్సులో మంత్రి లోకేశ్ వెల్లడి**

4 లో



2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది.



## లక్నోలో భారీ అగ్నిప్రమాదం

**కోచింగ్ సెంటర్‌లో మంటలు**

**14మంది దుర్మరణం, ఇద్దరికీ తీవ్ర గాయాలు**

లక్నో,జూన్22(సాక్ష్యం): ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో లోపల ఉన్న విద్యార్థులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు

మిగతా 2 లో..

## ఒకే ఇంట్లో నలుగురు అనుమానాస్పద మృతి

**భార్యాభర్తలతో పాటు, మరో ఇద్దరి మృతదేహాలుగా గుర్తింపు**

నల్లగొండ,జూన్22(సాక్ష్యం): నల్లగొండ పట్టణంలోని తెలంగాణ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో నలుగురు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతుల్లో

మిగతా 2 లో..

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

**జిల్లాకో మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలు**

**ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్,జూన్ 22(సాక్ష్యం): రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవార రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 5 లో..


# సంపాదకీయం

## ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన !

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. చినుకు పడడమే కష్టంగా మారింది. నైరుత ప్రవేశించినా చుక్కనీరు చిక్కలేదు. భూములు తడవలేదు. వ్యవసాయం పూర్తిగా పడకేసింది. నదులు నోరెళ్లబెట్టాయి. భూగర్భజలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సాగు ఎలా ఉన్నా తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడేలా ఉంది. కృష్ణా,గోదావరి నదులు వట్టిపోయాయా అన్నట్లుగా మారాయి. ఈ పాటికి గోదావరిలో ఎగువ నుంచి నీరు వచ్చేది. దీంతో సాగు సాగేదెలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో పంటల ఎంపికపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని వాతావరణ శాఖ తెలియచేస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుంటాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే నైరుతి వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో కనిపించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. వాతావరణ మార్పుల కారణంగా నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి. భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, వ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్య మవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

## బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత

మొదటిపేజీ తరువాయి..



ప్రధానుల సంఖ్య ఆరుకి చేరింది. కీర్ స్టార్మర్ 2024లో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ పేలవమైన ప్రదర్శన మాత్రమే ఇవ్వడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (ఆనీనిజీటె ఘసబీపూ) ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

## ఒకే ఇంట్లో నలుగురు అనుమానాస్పద మృతి

మొదటిపేజీ తరువాయి..

భార్యాభర్తలు సుల్తాన్, హసీనా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు ఇంకా తెలియరాలేదు. నల్లగొండ ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగుల వ్యాపారం నిర్వహిస్తుండగా, హసీనా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటన ఆత్మహత్యా? లేక హత్యా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇంట్లో నలుగురు మృతిచెందడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనా స్థలం నుంచి ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు, మృతుల బంధువులు, స్థానికులను విచారిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# అభివృద్ధికి సహకరించండి

మొదటిపేజీ తరువాయి..

సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమ్ఆర్‌వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్నారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యం కోసం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ వంటి సౌకర్యాలను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్రమంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఇటీవలి కాలంలో మధ్య ఆసియాలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు సరైన ప్రాంతాల కోసం అన్వేషిస్తున్నాయని తెలిపారు. హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైన ప్రాంతమని వివరించారు. ఈ క్రమంలోనే ఆ దిశగా అభివృద్ధి చేయాలని రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్అండ్‌బీ ప్రత్యేక సెక్రటరీ వికాస్‌రాజ్.. సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు.. ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్.. స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ ఉన్నారు.

## కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ

మొదటిపేజీ తరువాయి..

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మధ్య డైలాగ్ వార్ జరుగుతోన్న వేళ ఈ భేటీకి ప్రాధ్యానత సంతరించుకుంది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఇరువురు ఒకరిపై ఒకరు విమర్శలు వర్షం కురిపించుకుంటున్నారు. కిషన్ రెడ్డి వల్లే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్ట్ ఆగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించగా.. తన వల్ల తెలంగాణకు రావాల్సిన ఏ ప్రాజెక్ట్ ఆగిపోలేదని కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అయితే, హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ ఫేజ్ 2 అనుమతులు, పెండింగ్ నిధులపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ అరేంజ్ చేయాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. సీఎం అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కిషన్ రెడ్డి.. సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ సెట్ చేశారు. ఈ సమావేశంలో ఆయన కూడా పాల్గొన్నారు. ఉప్పు నిప్పులా ఉన్న ఇద్దరు నేతలు ఒకే గదిలో కూర్చొని చర్చించడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి నేడు మరో కీలక భేటీలో పాల్గొననున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఆయన సమావేశం కానున్నారు. ఈ భేటీలో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టు విస్తరణ, కేంద్ర ప్రభుత్వ వాటా, నిధుల మంజూరుపై ప్రధానంగా చర్చించనున్నారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో జరిగే ఈ అత్యంత ప్రాధాన్యత కలిగిన సమావేశానికి కూడా కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి హాజరుకానున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## భారత్ అబివృద్ధిని చూసింది

మొదటిపేజీ తరువాయి..

మీడియా నెట్‌వర్క్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రిపబ్లిక్ సమిట్ 2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ప్రస్తుతం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలు కేవలం ఈ తరానికే కాకుండా వచ్చే వెయ్యేళ్ల భవిష్యత్తును నిర్మిస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. భారతదేశం అనేది తాత్కాలిక లేదా క్షణిక సంఘటనలకు స్పందించి ఉద్వేగానికి లోనయ్యే దేశం కాదన్నారు. 'భారత్ అబివృద్ధిని చూసింది. విధ్వంసాన్ని కూడా ఎదుర్కొంది. క్షణిక సంఘటనలతో అస్థిరపడిపోం. వీటన్నింటినీ తట్టుకొని నిలబడిన చైతన్యం మనది. వేల



ఏళ్ల నాగరికత అనుభవాన్ని మోస్తున్నాం. ఎంతో నమ్మకంతో, బాధ్యతతో చెబుతున్నా. నేడు భారత్ చేస్తున్న ప్రతి పని, తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న చర్యలు రాబోయే వెయ్యి సంవత్సరాల దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయి' అని మోదీ వివరించారు. ఈ సందర్భంగా మోదీ ధర్మం గురించి కూడా ప్రస్తావించారు. ధర్మం అంటే కర్తవ్యం, న్యాయం, సంభాషణ, కరుణ వంటి విలువల సమాహారం అని చెప్పారు. భారతదేశం శక్తిని ఇదే దృక్పథంతో, ఇదే కోణంలో చూస్తుందని వివరించారు. ఇటీవల జీ7 సదస్సులో పాల్గొని వచ్చిన విషయాన్ని మరోసారి గుర్తు చేసిన మోదీ- ప్రపంచ దేశాలన్నీ నేడు భారత్‌కు ఉన్న ప్రాధాన్యతను గుర్తిస్తున్నాయని చెప్పారు. 'నేటి భారతదేశానికి నేషన్ ఫస్ట్ అనేదే ప్రథమ ప్రాధాన్యం, మార్గదర్శక సూత్రం అని ప్రపంచంలోని ప్రతి దేశం, అంతర్జాతీయ నేతలు స్పష్టంగా అర్థం చేసుకున్నారు.' అని మోదీ వ్యాఖ్యానించారు. గత 12 ఏళ్లలో భారత్ సాధించిన ప్రతి విజయం వెనుకా ఈ సూత్రమే ఉందని, దేశ ప్రజలంతా తమ విధుల్ని సక్రమంగా నిర్వహించడం వల్లే అన్ని కార్యక్రమాలు విజయవంతమయ్యాయని కొనియాడారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. రాజ్యాంగం పేరుతో నేడు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నవారు గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పేదల పరిస్థితిని పట్టించుకోలేదని మోదీ ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగం గురించి ప్రస్తావించినందుకే ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సందర్భాల్లోనూ కాంగ్రెస్ నేతలు అప్పుడు మౌనంగా ఉన్నారని ఆరోపించారు. 2014 తర్వాత తమ ప్రభుత్వం 'నేషన్ ఫస్ట్' భావనతోనే ముందుకు సాగిందని తెలిపారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లోనూ భద్రతతో పాటు ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయన్నారు.బస్తర్‌లో ఒకప్పుడు బాంబులు, తుపాకుల సంస్కృతి ఎక్కువగా ఉండేదని, ఇప్పుడు క్రీడలకు కేంద్రంగా మారిందన్నారు ప్రధాని. బస్తర్ ఒలింపిక్స్‌లో లక్షలాది యువత పాల్గొంటున్నారని చెప్పారు. ప్రజల ఆకాంక్షలు పెరగడం అనేది అసంతృప్తిని సూచించదని, ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం అని మోదీ అన్నారు. ఈ సందర్భంగానే మోదీ కాంగ్రెస్ పార్టీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'ప్రజలే కాదు కాంగ్రెస్ పార్టీ కూడా మోదీజీ ఇది చేయాలి. అది చేయాలని చెబుతోంది. ఎందుకంటే ఎవరు చేస్తారని నమ్మకం ఉంటే వారినే ప్రజలు ఆశ్రయిస్తారు. అదే నమ్మకం ప్రజల్లోనూ, ప్రత్యర్థుల్లోనూ ఉంది' అని మోదీ చమత్కరించారు. ఇదే సమిట్‌లో పాల్గొన్న జోహో ఫౌండర్ శ్రీధర్ వేంబును ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. దేశ అవసరాల్ని అర్థం చేసుకొని 'నేషన్ ఫస్ట్' అనే భావనతో పనిచేసే పారిశ్రామిక వేత్తలు సంస్థల్ని మాత్రమే కాదు, దేశాన్ని కూడా ముందుకు తీసుకెళ్తారని అన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో వివాటెక్ ప్రదర్శనలో జోహో స్టాల్ వద్ద భారీగా యువత గుమిగూడటాన్ని తాను ప్రత్యక్షంగా చూశానని, యూరప్ యువత జోహో గురించి తెలుసుకునేందుకు చూపిన ఆసక్తి తనకు చాలా గర్వంగా అనిపించిందని మోదీ అన్నారు. భారత సంస్థలు ప్రపంచ వేదికలపై ఇలా ప్రత్యేకంగా గుర్తింపు పొందుతుండటం దేశ ఆవిష్కరణ శక్తికి నిదర్శనం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## లక్నోలో భారీ అగ్నిప్రమాదం



మొదటిపేజీ తరువాయి..

ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ఐదుగురు నుంచి ఏడుగురు విద్యార్థులు భవనం నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు



తెలిపారు. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఎనిమిది ÷రిరజన్లతో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పలువురు విద్యార్థులు భవనంలో చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిప్రమాదంపై స్పందించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. లఖ్‌నవూ కోచింగ్ సెంటర్ అగ్నిప్రమాద స్థలాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. అగ్నిప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కొంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి నివేదిక అందించాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), అదనపు ప్రధాన కార్యదర్శి (హోం)లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం


మొదటిపేజీ తరువాయి..

మేరకు..రాష్ట్ర రోడ్లు / భవనాల శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను విడుదల చేసినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇదివరకే తాను సమీక్షించిన అంశాల మేరకు ఆర్/బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి సూచించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. త్యవసర పరిస్థితులను.. ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, డీ-వాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, హెచ్‌డీపీఈ పైపులు తదితర అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ప్రమాదకర ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ సేఫ్టీ పోర్టల్, తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని,పోలీస్,రెవెన్యూ, ఇరిగేషన్,విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని, వరద నీరు తగ్గిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, జీపీఎస్ వివరాలతో నష్టం అంచనా నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఇంజినీర్లకు అప్పగించిన అధికారాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వరదల కారణంగా చేపట్టే పునరుద్ధరణ పనుల వ్యయాన్ని ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఎంఎఫ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. వర్షపాతం తీవ్రతను బట్టి రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్,ఎల్లో,ఆరెంజ్, రెడ్ కలర్-కోడ్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థను అమలు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వర్షపాతం నమోదయ్యే ఆరెంజ్ అలర్ట్ సమయంలో ఇఇలు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండగా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెంటర్ కు ఈ వర్షాకాలంలో రోజువారీ పరిస్థితుల నివేదికలు తప్పనిసరిగా సమర్పించాలని, నష్టం జరగకపోయినా 'నిల్ రిపోర్ట్' ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

మొదటిపేజీ తరువాయి..

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్



మాట్లాడుతూ.. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్ని అయినా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. తెలంగాణ రైతుల హక్కులు, సాగునీటి భద్రత కోసం ప్రభుత్వం అన్ని వేదికలపై పోరాడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## కార్మిక సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతకు ప్రాధాన్యత

### సంక్షేమ బోర్డు నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

సాక్ష్యం , విశాఖపట్నం.

రాష్ట్రంలోని కార్మికులకు సంక్షేమ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు సాంకేతికత వినియోగాన్ని విస్తరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్‌లో సోమవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కార్మికుల వెల్ఫేర్ బోర్డు



45వ సమావేశంలో ఆయన పాల్గొని, బోర్డు నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్దిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఇకపై ఆన్‌లైన్‌లో సులభంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, డిజిటల్ సేవల ద్వారా కార్మికులకు ప్రభుత్వ పథకాలను మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. అనంతరం జరిగిన 45వ బోర్డు సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, కార్మికుల నమోదు ప్రక్రియల సరళీకరణ, భద్రతా చర్యల బలోపేతం, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ కార్యదర్శి ఎం.వి. శేషగిరి బాబు, కమిషనర్ గంధం చంద్రుడు, వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్, బోర్డు సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోను ధైర్యంగా ఎదుర్కొందాం

### – రైతులకు ప్రతి అడుగులో అండగా ఉంటాం: మంత్రి అచ్చెన్నాయుడు

సాక్ష్యం, విశాఖపట్నం.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ప్రతి అడుగులో అండగా నిలుస్తూ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ముందస్తు ప్రణాళికలు, సాంకేతిక సూచనల ద్వారా నష్టాలను తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సచివాలయంలో వ్యవసాయ శాఖ రూపొందించిన



"ఎల్‌నినోను సమర్థవంతంగా ఎదుర్కొందాం" ప్రత్యేక సమాచార సంచికను మంత్రి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షపాతం లోపాలు, అధిక ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు.
రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ వాతావరణ మండలాలకు అనుగుణంగా పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులు, నేల తేమ సంరక్షణ, విత్తనాల వినియోగం, పంటల సంరక్షణకు సంబంధించిన సమగ్ర సూచనలను ఈ సమాచార సంచికలో పొందుపరిచినట్లు తెలిపారు. రైతులు వీటిని పాటించడం ద్వారా ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించి దిగుబడులను కాపాడుకోవచ్చన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, సహకార శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలు అమలు చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. గ్రామ స్థాయి వరకు రైతులకు సాంకేతిక సలహాలు, వాతావరణ హెచ్చరికలు, పంటల నిర్వహణ సూచనలు చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి వాతావరణ సవాళ్లు ఎదురైనా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్, డైరెక్టర్ మంజీర్ జిలానీతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

సాక్ష్యం, విశాఖపట్నం.

తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని




కోరుతూ కర్ణాటక రాష్ట్ర మాజీ మైనర్ ఇరిగేషన్ మంత్రి ఎన్.ఎస్. బోసురాజు, ఎమ్మెల్యే బసవరాజ్ రాయ్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవన్న గౌడ బదర్లి సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 25న తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల ప్రారంభోత్సవం జరగనుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త గేట్లను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక ప్రజాప్రతినిధులతో మంత్రి నిమ్మల రామానాయుడు పలు అంతర్రాష్ట్ర జలవనరుల అంశాలపై చర్చించారు. 2024లో వచ్చిన భారీ వరదల కారణంగా తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోయిన అనంతరం స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు చేసి సుమారు 80 టీఎంసీల నీటిని కాపాడడంతో పాటు రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చగలిగామని తెలిపారు.

## మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం చేయాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు

సాక్ష్యం , విశాఖపట్నం.

ప్రజల నుంచి వచ్చే పీజీఆర్ఎస్ సహా అన్ని అర్జీలను మానవీయ కోణంలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.
ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి స్పందించాలని ముఖ్యమంత్రి అన్నారు. అర్జీదారుల స్థానంలో ఉండి వారి ఇబ్బందులను అర్థం చేసుకుని పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలతో సౌమ్యంగా వ్యవహరించడం ద్వారా ప్రభుత్వ పాలనపై సానుకూల భావన ఏర్పడుతుందని పేర్కొన్నారు.
ఉద్యోగుల్లో వినూత్న ఆలోచనలను ప్రోత్సహిస్తామని, పనితీరు ఆధారంగా బాధ్యతలు అప్పగిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగులు తమ సామర్థ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యం



ఇవ్వడం ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకుని సరైన నిర్ణయాలు తీసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలో కొన్ని శక్తులు ప్రతి అంశాన్ని రాజకీయ రంగు పులుముతూ, కులం, మతం పేరుతో వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. తప్పుడు ప్రచారాలు, విద్వేషాలను రెచ్చగొట్టే చర్యల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం జరిగే సందర్భాల్లో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పాత నేర కేసులను ట్రేస్ చేసి నిందితులను గుర్తిస్తున్నామని, 2019లో జరిగిన కొన్ని కేసుల్లో కూడా పురోగతి సాధించి నిందితులను అరెస్టు చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తప్పు చేసిన వ్యక్తి ఎప్పటికైనా శిక్షకు గురవుతాడనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రమాణాలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దేవుడి సొమ్ము దేవుడికే.. సనాతన ధర్మ రక్షణే లక్ష్యం: మంత్రి ఆనం

సాక్ష్యం, విశాఖపట్నం.

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే దేవాదాయ ధర్మాదాయ శాఖలో సమగ్ర సంస్కరణలు చేపట్టి ఆంధ్రప్రదేశ్‌ను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని గతంలో 22-ఏ కింద నమోదైన భూముల సమస్యలను పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించింద



రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. మేనిఫెస్టోలో దేవాదాయ శాఖకు సంబంధించి ఇచ్చిన 11 హామీల్లో ఇప్పటికే 10 హామీలను అమలు చేశామని ఆయన వెల్లడించారు. సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, చిన్న ఆలయాల ధూపదీప నైవేద్యాల కోసం నెలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని, వేద పండితుల గౌరవ వేతనాన్ని రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచినట్లు తెలిపారు. ఆలయాల భద్రత, ఆస్తుల రక్షణ కోసం రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షణను బలోపేతం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, న్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని 162 ఆలయాల పునర్నిర్మాణ పనులను రూ.71.60 కోట్ల వ్యయంతో చేపట్టి 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. దేవాదాయ శాఖలో ఖాళీగా ఉన్న 342 పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించామని, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను తిరిగి దేవాదాయ శాఖలో విలీనం చేసినట్లు వెల్లడించారు. తిరుమలలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ప్రవేశ పెట్టడం ద్వారా భక్తుల నిర్వహణ మరింత సమర్థవంతంగా మారిందని, రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల ఆదాయం, భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

## రైతులకు ఎరువుల కొరత ఉండదు.. అక్రమాలకు తావులేదు

సాక్ష్యం , విశాఖపట్నం

రాష్ట్రంలో ఖరీఫ్-2026 వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో అక్రమాలు, బలవంతపు విక్రయాలను



ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన ఎరువుల లభ్యత, నిల్వలు, సరఫరా పరిస్థితులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో అవసరానికి మించి ఎరువుల నిల్వలు ఉన్నాయని, ముఖ్యంగా యూరియా సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండదన్నారు. యూరియా లేదా డీఏపీ కొనుగోలు చేసే రైతులకు బలవంతంగా ఇతర ఎరువులు విక్రయించడం తక్షణమే నిలిపివేయాలని డీలర్లు, కంపెనీలకు ఆదేశించారు. ఎంఆర్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని స్పష్టం చేశారు. యూరియా అక్రమ రవాణా, నిల్వలను అరికట్టేందుకు ప్రత్యేక విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. కౌలు రైతులు, ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎరువుల బుకింగ్ వ్యవస్థలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటీపీలు, మెసేజ్ లింకులకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. నానో యూరియా వినియోగం, సహజ వ్యవసాయం ప్రయోజనాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించిన మంత్రి, రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి సమతుల్య పోషకాల వినియోగంపై రైతులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఖరీఫ్ సీజన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్య సాధనకు ఐఎఫ్ఎంఆర్‌తో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఒప్పందం

### 15 శాతం వృద్ధి రేటే లక్ష్యం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

సాక్ష్యం , విశాఖపట్నం

స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ అమలుకు మరింత బలమైన కార్యాచరణను రూపొందించే దిశగా రాష్ట్ర ప్రణాళిక శాఖ సోమవారం క్రియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫైనాన్షియల్



మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్)తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రం 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదగాలంటే వార్షికంగా 15 శాతం ఆర్థిక వృద్ధి రేటు సాధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. 2014-19 మధ్య రాష్ట్రం 13.5 శాతం కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) నమోదు చేసిందని, ప్రస్తుతం వివిధ పరిస్థితుల కారణంగా వృద్ధి రేటు సుమారు 11 శాతం వద్ద ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు.ఈ ఒప్పంద పత్రాలను రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధి కపిల్ విశ్వనాథన్ పరస్పరం మార్చుకున్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 విజన్‌లోని పది మార్గదర్శక సూత్రాల అమలుకు ఐఎఫ్ఎంఆర్ సాంకేతిక, విధానపరమైన సహకారం అందించనుంది. జీఎస్డీపీ లక్ష్యాల సాధన కోసం ప్రత్యేక మిషన్ సెల్‌ల ఏర్పాటు, అధిక వృద్ధి రేటు సాధనకు అవసరమైన వ్యూహాల రూపకల్పనలో ఐఎఫ్ఎంఆర్ కీలక పాత్ర పోషించనుంది. అలాగే జీరో పావర్టీ మిషన్, వాటర్ సెక్యూరిటీ మిషన్, డీప్‌టెక్ మిషన్ వంటి కీలక కార్యక్రమాల అమలులో ప్రభుత్వానికి సహకరించనుంది. పది మార్గదర్శక సూత్రాలకు సంబంధించి క్షేత్రస్థాయి అధ్యయనాలు నిర్వహించడం, విధాన సూచనలు అందించడం, వినూత్న పరిష్కారాలను ప్రతిపాదించడం వంటి బాధ్యతలను కూడా ఐఎఫ్ఎంఆర్ చేపట్టనుంది. భవిష్యత్తులో ఇతర రంగాలకు కూడా ఈ భాగస్వామ్యాన్ని విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి డీప్ టెక్నాలజీల వినియోగాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటోందని ముఖ్యమంత్రి తెలిపారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), డ్రోన్ మ్యాపింగ్, ఆటోమొబైల్, ఉక్కు, అరుదైన ఖనిజాలు, సెమీకండక్టర్లు, రక్షణ తయారీ వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీల అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో నిలిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, క్రియా యూనివర్సిటీ, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధులు, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విదేశీ విద్యార్థులు "గీతం రాయబారులు"

సాక్ష్యం, విశాఖపట్నం.

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రవేశాలు పొంది వివిధ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన విదేశీ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా గీతం విశ్వవిద్యాలయం పేరు ప్రతిష్ఠలను విస్తరింపజేసే "గీతం రాయబారులు"గా నిలుస్తారని విశ్వవిద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు పేర్కొన్నారు. స్వదేశాలకు తిరిగి వెళ్తున్న విదేశీ విద్యార్థుల కోసం సోమవారం నిర్వహించిన ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విదేశీ విద్యార్థుల విద్య, వ్యక్తిత్వ వికాసానికి గీతం విశ్వవిద్యాలయం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల ద్వారా విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యార్థులు తమ మేధస్సును సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా వినియోగించాలని, ఉన్నత విద్య, పరిశోధనల



ద్వారా తమ దేశాల అభివృద్ధికి తోడ్పడే మానవ వనరులుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ మాట్లాడుతూ ప్రస్తుతం 43 దేశాలకు చెందిన 450 మందికి పైగా విదేశీ విద్యార్థులు గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల్లో వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏడాది విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నందున వారికి అవసరమైన విద్య, వసతి మరియు ఇతర సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తున్నామని చెప్పారు. భారతీయ విద్యా విధానం, సంస్కృతి పట్ల విదేశాల్లో ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో గీతం విశాఖపట్నం ప్రాంగణం నుంచి 40 మంది విదేశీ విద్యార్థులు ఇంజినీరింగ్, ఫార్మసీ, లా, సైన్స్, పారామెడికల్, మేనేజ్‌మెంట్ కోర్సులను పూర్తి చేసుకున్నారని తెలిపారు. అనంతరం పట్టభద్రులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల విభాగం ప్రతినిధి అరుణ్ కార్తిక్, జిమ్‌సర్ బయోకెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ విశ్వకళ్యాణ్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## హనుమంతు పురుషోత్తం ఎస్టీఐ శాఖ కార్యదర్శిగా బాధ్యతల స్వీకరణ

సాక్ష్యం , విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ (ఎస్టీఐ) శాఖ




కార్యదర్శిగా డా. హనుమంతు పురుషోత్తం సోమవారం అమరావతిలోని సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సైన్స్, టెక్నాలజీ, ఆర్&డి, ఐపీఆర్ రంగాల్లో దాదాపు 40 ఏళ్ల అనుభవం కలిగిన డా. పురుషోత్తం గతంలో ఎన్ఆర్డీసీ సీఎండీగా, ఏఎంటీజెడ్ డైరెక్టర్‌గా, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశోధన, ఆవిష్కరణలకు మౌలిక వసతుల బలోపేతం, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపు, స్టార్టప్‌లు మరియు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు ప్రోత్సాహం కల్పించడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఐఏఎస్, జి.ఏ.డి ప్రధాన కార్యదర్శి జె. శ్యామలారావు ఐఏఎస్, ఏపీసీఓఎస్టీ సీఈఓ డా. కె. శరత్ కుమార్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీని సందర్శించిన ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు జోహన్నెస్ జుట

సాక్ష్యం, విశాఖపట్నం.

విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్), ఆంధ్ర మెడికల్ కాలేజీని ప్రపంచ బ్యాంక్ దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు జోహన్నెస్



జుట్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కె. పద్మావతి, ప్రపంచ బ్యాంక్ హెల్త్ టీమ్ ప్రతినిధి అమిత్ నాగరాజ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి అతిథులకు స్వాగతం పలికి, ఆంధ్ర మెడికల్ కాలేజీ, కేజీహెచ్ శతాబ్ద కాల చరిత్ర, వైద్య విద్య, పరిశోధన రంగాల్లో సాధించిన విజయాలు, ఆధునిక వైద్య సేవల్లో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను వివరించారు.

## భూమి గురించి అడిగితే ఎస్‌బిఐపై పగబట్టారు

### రాయదుర్గం భూమల వేలంపై హరీష్ రావు ఫైర్

మహబూబ్‌నగర్,జూన్22(సాక్ష్యం): హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చిందని, అయితే...రేవంత్ రెడ్డి బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని అమ్మేసిండని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అంతేగాకుండా ఇప్పుడు ఎస్‌బిఐ మీద పగపట్టిండని మండిపడ్డారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమిని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిర్రు. ఇది కూడా ఉచితంగా ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు.కోర్టు వాళు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది. ఖతం రేవంత్ రెడ్డి ఎస్‌బీఐ మీద పగపట్టిండు. ఎస్‌బీఐని నిషేధిస్తాం. ఎస్‌బీఐలో ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లు బయటకు తీసేస్తాం. ఎస్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే ఖాతాలన్ని తీసేస్తా.. అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండు.. రేవంత్ రెడ్డి తీరు ఎవరన్నా ప్రశ్నిస్తే పగబడ్తమన్నట్టు ఉంది. ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే నిషేధిస్తా అంటున్నడు.. రేపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్ కూడా నీ మాట వినలేదనుకో దాన్ని కూడా నిషేధిస్తా అంటాడు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక ఒక బ్యాంక్ అయితే కావాలి కదా.. ఎవరు నీకు వ్యతిరేకంగా మాట్లాడితే ఆ బ్యాంక్‌నే నిషేధిస్తా అంటే మరి ఏం చేస్తడు.. నాకో డౌటు..కొత్తగా కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టడో ఏమో.. పెట్టినా పెట్టడు మస్త్ జమ అయినయ్ పైసలు. రేపు ఎనుముల కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టినా పెట్టరన్నారు హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

## బట్టలు ఆరేస్తుండా విద్యుత్ షాక్

### భార్యాభర్తలు మృతి

నిజామాబాద్,జూన్22(సాక్ష్యం): నిజామాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ తీగలు తగడంలో భార్యాభర్తలు ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ముగ్గురు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బోధన్ మండలం ఉట్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులు రత్నావత్ సంజీవ్(45), జ్యోతి (41) బట్టలు ఉతికి ఆరేస్తుండగా బట్టలు ఆరవేసే తీగకు కరెంట్ వైర్లు తగిలి విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో విద్యుదాఘాతానికి గురై వారిద్దరూ అక్కడే దుర్మరణం చెందారు. వారి ముగ్గురు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. భార్యాభర్తల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


## ఇసుక క్వారీ మార్చాలంటూ కలెక్టర్‌కు వినతి

కరీంనగర్,జూన్22(సాక్ష్యం): వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి పేరుమీద ఉన్న ఇసుక క్వారీని కొండపాకకు మార్చాలని కొండపాక ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కరీంనగర్ కలెక్టర్ చిత్రామిశ్రాను కోరారు. ఈ మేరకు వారు సోమవారం ప్రజావాణి కలెక్టర్ చిత్రమిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపాక రెవెన్యూ పరిధిలోని మానేరువాగుపై ఇసుక క్వారీ ఏర్పాటు చేసి పోతిరెడ్డిపల్లి పేరు మీద నడుపుతున్నారని అన్నారు. దీంతో కొండపాక గ్రామస్తులమైన తాము ఉపాధి కోల్పోతున్నామని, పోతిరెడ్డిపల్లి నుండి కొండపాక పేరుమీద మార్చి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పూరెళ్ల కుమార్, వార్డు సభ్యులు దాట్ల శ్రీనివాస్, కత్తి సురేష్, కొలుగూరి రాజేశ్, కే తిరుపతి, నల్లగాశ కుమారస్వామి, కాసర్ల అనిల్, పాల్గొన్నారు.

## నిరుద్యోగానికి తోడు..ఆర్థిక సమస్యలు

### ఉరేసుకుని యువకుడు బలవన్మరణం

నిజామాబాద్,జూన్22(సాక్ష్యం): ఎంబీఏ విద్య పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగం లభించకపోవడం, ఉండడానికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో మానసికంగా బాధపడుతూ ఓ యువకుడు మనస్థాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన దోమ్మటి నితిన్ గౌడ్ (27) తమ గ్రామంలో సొంత ఇల్లు లేకపోవడం, అలాగే ఎంబీఏ విద్య పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగం లభించకపోవడంతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. కాగా సోమవారం



లోంక గుడి కి వెళ్తున్నానని ఇంటి నుండి తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అనంతరం లోంక తండా దాటిన తర్వాత రోడ్డుపై తన బైకు నిలిపి సమీప అటవీ ప్రాంతంలో టేకు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## బోధన్ మున్సిపాలిటీలో కౌన్సిలర్ల నిరసన

### మూడు నెలలయినా సమావేశం పెట్టనందుకు ఆవేదన

నిజామాబాద్,జూన్22(సాక్ష్యం): బోధన్ పట్టణంలోని మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటై ముడు నెలలు గడుస్తున్నా సమావేశం నిర్వహించడం లేదని బోధన్ మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్ ఇలియాజ్ అలీ ఆధ్వర్యంలో ఎంఐఎం కౌన్సిలర్లు కార్యాలయం ఆవరణలో టెంట్ వేసి కుర్చీలలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పాలక వర్గం ఏర్పాటై మూడునెలలు పూర్తయినా నెలవారీ సమావేశాలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. అంతేకాకుండా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు కూడా స్పందించడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు విన్నవించామని ఆయన స్పందించకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ లో సమావేశలు నిర్వహించని కారణంగానా తామే కార్యాలయం ఆవరణలో టెంట్, కుర్చీలు వేసి అధికారులను ఆహ్వానించామన్నారు. అధికారులు ఇక్కడకు కూడా రాక పోవడంతో తమ సమస్యలతో కూడిన వినతిపత్రం ఖాళీ కుర్చీకి అందచేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారుల వైఫల్యం కారణంగా సమస్యల పరిష్కారం లో వార్డుల్లో ప్రజలకు ఏం చెప్పాలో తెలియక వార్డుల్లో తిరగడం కూడా మానివేశామని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ సమావేశాలు నిర్వహించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు హెచ్చరించారు.



# చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు



వరంగల్,జూన్22(సాక్ష్యం): వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలిపెట్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు. తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలను ఆదుకుంటే... కాంగ్రెస్ నేతలు వారి పెద్దలను చూసుకుంటున్నారని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో రాజకీయం దిగజారిపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చెప్పిన అబద్దాలను నమ్మి.. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టంకట్టారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభమని విమర్శించారు. మడికొండలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్, సోషల్ మీడియా శిక్షణా తరగతుల కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని.. పంటల కొనుగోల విషయంలో రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి రెండున్నరేళ్లు అయ్యిందని... అయినా ప్రజల మమకారం పోలేదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రమంతటా గులాబీ జెండా రెపరెపలే కనిపిస్తున్నాయన్నారు.

'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు... అధికారం మనకు మాత్రమే సొత్తు అనుకోవద్దు. ప్రజలకు మేలు చేస్తారేమో అని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు' అని చెప్పారు. దేశం మొత్తం కాంగ్రెస్ అనే దరిద్రాన్ని వదిలించుకుందని.. కానీ 420 హామీలు ఇవ్వడంతో తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. బాండ్ పేపర్లు ఇచ్చి, పథకాల వరద పారిస్తామన్నారని తెలిపారు. సీఎం రేవంత్ నోరు తెరిస్తే బూతుల బురద తప్ప... అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు.

# సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం



మొదటిపేజీ తరువాయి..

3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. తంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి గారు ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కారించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. త ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

# మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

మొదటిపేజీ తరువాయి..

చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు.

సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు. విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకు పడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.



# ఓట్, సీట్ చోరీలో బీజేపీ నిమగ్నం

### సర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం
### ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు వంద ఖాయం
### బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణలో టీపీసీసి చీఫ్ మహేశ్

హనుమకొండ,జూన్22(సాక్ష్యం): సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.



ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళ్తున్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## భూపాలపల్లి జిల్లాలో దుర్ఘటన

మొదటిపేజీ తరువాయి..

వెంకన్న వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, బొగ్గు లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి ఆయనపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకన్నకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకన్న మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## పిల్లకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యా యత్నం

### పిల్లలు మృతి...చావు బతుకల్లో తల్లి

ఖమ్మం,జూన్22(సాక్ష్యం): స్వగ్రామానికి మకాం మార్చే విషయంలో భర్తతో ఓ భార్య పడిన ఘర్షణ చివరికి వారి పిల్లల ప్రాణాలను తీసేదాకా వెళ్లిన ఘటన ఖమ్మం జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు .. ఖమ్మం జిల్లా



ఏదులాపురం మున్సిపాలిటీ గుర్రాలపాడుకు చెందిన బొబ్బిలి లింగరాజు, స్వాతి దంపతులు కొద్ది నెలలుగా ఖమ్మం త్రీటౌన్ గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి వేదక్‌కుమార్ (7), తనీశ్ (4) అనే కుమారులున్నారు. లింగరాజు ఓ సెల్‌ఫోన్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా షాపు నడుపలేనని, ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని లింగరాజుకు సెల్‌ఫోన్ షాపు యజమాని చెప్పాడు. లింగరాజు ఇదే విషయాన్ని భార్యకు చెప్పాడు. స్వగ్రామానికి వెళ్లి వేరే పని చూసుకుందామని చెప్పగా భార్య స్వాతి నిరాకరించింది. ఇదే విషయమై రెండు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్తపై కోపం పెంచుకున్న భార్య.. శనివారం లింగరాజు ఇంట్లో లేని సమయం చూసి.. బిస్కెట్లకు ఎలుకలమందు పూసి పిల్లలకు తినిపించింది. అనంతరం ఏమీ తెలియనట్టు భర్తకు ఫోన్ చేసింది. పిల్లలకు వాంతులు అవుతున్నాయని, త్వరగా ఇంటికి రావాలని చెప్పింది. దీంతో హుటాహుటిన ఓ మెడికల్ షాపునకు వెళ్లిన లింగరాజు.. వాంతులు తగ్గేందుకు ఓ సిరప్ తీసుకొని ఇంటికి వచ్చాడు. పిల్లలకు తాగించి పడుకోబెట్టాడు. విష ప్రభావంతో పెద్ద కుమారుడు వేదక్‌కుమార్ నిద్రలోనే కన్నుమూశాడు. చిన్న కుమారుడు తనీశ్‌కు ఆదివారం ఉదయం వాంతులు కావడంతో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. పిల్లల పరిస్థితి విషమిస్తున్న తరుణంలో స్వాతి సైతం ఎలుకలమందు తినడంతో స్థానికులు ఆమెను దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. ఖమ్మం త్రీటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. ఫాదర్స్‌డే రోజున ఓ తండ్రి తన పిల్లలను కోల్పోవడం విషాదాన్ని మిగిల్చింది.

## బయ్యారంలో అడవి జంతవుల మాంసం విక్రయం

### తనిఖీల్లో పట్టుకున్న అటవీశాఖ అధికారులు

మహబూబాబాద్,జూన్22(సాక్ష్యం): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని కాకతీయనగర్‌లో అడవి జంతువుల మాంసం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే అధికారుల రాకను గమనించిన కొందరు స్మగ్లర్లు అక్కడి నుంచి పరారయ్యారు. అధికారుల తనిఖీ సమయంలో మాంసం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌తో వేటగాళ్లు వాగ్వాదానికి దిగారు. పరిస్థితిని అదుపులోకి తీసుకున్న అధికారులు విచారణ చేపట్టారు. అధికారుల తనిఖీల్లో సుమారు 30 కిలోల అడవి జంతువుల మాంసంతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సంబంధిత అటవీ చట్టాల కింద అధికారులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అడవి జంతువుల వేట, మాంసం విక్రయం, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

## బాబు జగ్జీవన్‌రామ్ భవన్ విస్తరణ
## శ్మశానవాటిక పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం: పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, జూన్ 22 (సాక్ష్యం):** మల్లాపూర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్ కమ్యూనిటీ హాల్‌ను విస్తరించడంతో పాటు నోమ కళ్యాణ వేదిక పక్కన ఉన్న ఎస్సీ మాదిగల హిందూ శ్మశానవాటికను ఆక్రమణదారుల కబ్జా నుంచి విముక్తి చేసి ఆధునికీకరించాలని అరుంధతి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డిని కోరారు. సొసైటీ అధ్యక్షుడు ఏడల గణేష్ ఆధ్వర్యంలో ప్రతినిధులు పరమేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాబు జగ్జీవన్‌రామ్ పేరుతో ఉన్న భవన్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వబోమని స్పష్టం చేశారు. ఎస్సీ మాదిగ సోదరుల శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. వెంటనే



రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని, ఆక్రమణలు ఉంటే తొలగించి శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ఈ అంశాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి కూడా తీసుకెళ్తామని పేర్కొన్నారు. దళిత సోదరుల ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏడల గణేష్, వెంకట్ ప్రసాద్, లక్ష్మీపతి, రవి, మురళి, ఉదయ్, మహేష్, శివశంకర్, వినయ్, ప్రణయ్, ధనరాజ్, సుధాకర్ ప్రసాద్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు కప్పర సాయి గౌడ్, నెమలి అనిల్, బెల్లం శ్రీను, టిల్లు ముదిరాజ్, విజయ్ రెడ్డి, బాలరాజ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ధన్నపేటలో ఫర్టిలైజర్ షాపులకు పోలీసుల ఝలక్

- పోలీస్‌ల ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు
- నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయి
- ఎస్సై సాయిబాబు

**వర్ధన్నపేట, జూన్ 22(సాక్ష్యం):** వానాకాలం సీజన్ నేపథ్యంలో రైతులను మోసం చేసే నకిలీ విత్తనాలు, ఎక్స్‌పైర్డ్ పురుగుమందుల విక్రయాలపై పోలీసులు దృష్టి సారించారు. వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు సోమవారం పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, విత్తనాలు, పురుగుమందులను క్షుణ్ణంగా పరిశీలించారు. నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన ఎక్స్‌పైర్డ్ పేస్టిసైడ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షాపుల యజమానులను హెచ్చరించారు. రైతు పంటపై







ఆశ పెట్టుకుని విత్తనం వేస్తాడు. నకిలీ విత్తనం వేస్తే ఆరుగాలం కష్టం బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అలాంటి మోసాలకు పాల్పడితే సహించేది లేదు అని ఎస్సై సాయిబాబు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే బిల్లుతో సహా విత్తనాలు కొనుగోలు చేయాలని, అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఉప సర్పంచులకు గౌరవ వేతనం ఇవ్వాలి

- ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దుపై వస్తున్న వార్తలను ప్రభుత్వం వెంటనే ఖండించాలి
- బొట్ల కార్తీక్ (ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు)

**భూపాలపల్లి జూన్ 22 (సాక్ష్యం);** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉప సర్పంచ్ ల ఫోరం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు గట్టు ప్రదీప్ గౌడ్ ఆధ్వర్యంలో హలో ఉప ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ హాజరై తనంతరం మాట్లాడుతూ గత 20 రోజులుగా వార్త పత్రికల్లో ఉప సర్పంచ్ ల చెక్ పవర్ రద్దు పై వస్తున్న వార్తలను ఖండించాలని ఈ సందర్భంగా కార్తీక్ ప్రభుత్వాన్ని కోరారు లేని యెడల జూన్ 25 న హైదరాబాద్ లో ఇందిరా పార్క్ వద్ద నిరసన దీక్ష చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఉప సర్పంచ్ ల ఫోరం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు గట్టు ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ సర్పంచ్ లతో పాటు ఉప సర్పంచ్ లకు కూడా ప్రత్యేక విధులు శిలపలక పై పేర్లు తీర్మానాలు పై సంతకాలు చేశారు ఉప సర్పంచ్ లకు వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని వారు అన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి శంకర్ ,చెమ్మల సుధీర్, స్వర్ణలత శ్రవణ్ వివిధ మండలాల అధ్యక్షులు పిండి ప్రభాకర్,కృష్ణ,నాగరాజు శ్రీజ సంతోష్ శంకర్. కమలాకర్ వివిధ గ్రామాల ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.



## లోక్ అదాలత్ ద్వారా 10,922 కేసులు పరిష్కారం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్


**హనుమకొండ, జూన్ 22 (సాక్ష్యం)** వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని వరంగల్ పోలీస్ కమిషనర్ అన్నారు. వీటి ద్వారా 10922 కేసులు పరిష్కార మయ్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 1 కోటి 17 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన మొత్తం కేసుల్లో కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు - 1880,డిజాస్టర్ మేనేజ్మెంట్ కేసులు-2864, ఈ పెట్టి కేసులు -201, డ్రంకెన్ అండ్ డ్రైవ్, మోటార్ వెహికల్ చట్టం కేసులు-5977, సైబర్ కేసులు - 197 పరిష్కరించడం ద్వారా బాధితులకు సంబంధించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన 1,17,95,706/- రూపాయలు బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు




వెలుబడించిందని తెలిపారు. రాజీ మార్గం రాజా మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవాధికారులకు ఈ సందర్భంగా సీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నిరుపేదల అభివృద్ధి కోసం
## హైదరాబాదు నుండి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ ( జూన్.22)** హైదరాబాదు నుండి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, జిల్లాలోని గంగారం మండలం నిరుపేదల అభివృద్ధి తీసుకోవలసిన అంశాలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు,ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత నిరుపేద కుటుంబాల అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి వారి అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు,అందులో భాగంగానే జిల్లాలోని గంగారం మండలంలోని (12) గ్రామపంచాయతీల పరిధిలో గుర్తించిన నిరుపేద (791) కుటుంబాలకు వారి అభ్యున్నతికి, స్వయం సహాయక బృందాలలో కొనసాగుతున్న వారికి, వారి పిల్లల విద్యా ,ఆరోగ్యం, కుటుంబంలోని పెన్షన్లు, హౌసింగ్ ఇందిరమ్మ ఇండ్లు, ఆర్థిక




స్వావలంబన, తదితర ప్రభుత్వ పథకాల అమలు కోసం నిధులు కేటాయించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, అందుకోసం క్షేత్రస్థాయిలో సంబంధిత విభాగాల వారు పూర్తి నివేదికలు సిద్ధం చేసి పంపాలని తెలిపారు,ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ గంగారం మండలంలో అన్ని విభాగాలు , ఎస్ప్రెస్ వెల్ బ్లాక్ అధికారి సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించడం జరిగిందని, ఇప్పటికే వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అర్హులను గుర్తించడం జరిగిందని, ప్రతి శుక్రవారం ప్రజా దర్బారులు నిర్వహించి ప్రజల వినతులను స్వీకరించడం జరుగుతుందని, వెంటనే సంబంధిత విభాగాలకు సిఫారసు చేసి సమస్యల పరిష్కారం నిమిత్తం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు , హౌసింగ్ పిడి పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన రాజు, ఏపీ డి శ్రీనివాసరావు, ఏబీ ఫెలో శ్రీనాథ్, డిపిఎం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఫణిగిరి, గాజులబండ బౌద్ధ కట్టడాల పరిరక్షణ
## పనుల సమగ్రాభివృద్ధికి రూ.5 కోట్లు: మంత్రి జూపల్లి శంకుస్థాపన

**సూర్యాపేట జిల్లా కరస్పాండెంట్ జూన్ 22)** తెలంగాణలోని ప్రాచీన బౌద్ధ వారసత్వ సంపద పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, క్రీడా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో ఫణిగిరి, గాజులబండ బౌద్ధ క్షేత్రాల్లో పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే మందుల సామేల్ తో కలిసి మంత్రి







జూపల్లి కృష్ణారావు సోమవారం శంకుస్థాపన చేశారు. తెలంగాణ జెన్కో (వైటీపీఎస్) సీఎస్ఆర్ నిధులతో ఫణిగిరి బౌద్ధ కట్టడాల పరిరక్షణకు రూ. 1.60 కోట్లు, గాజులబండ కట్టడాల సంరక్షణకు రూ.23 లక్షలు నిధులు మంజూరు చేశారు.ముందుగా మంత్రి హౌణిగిరిలో పురావస్తు శాఖ వారి తవ్వకాలలో లభించిన బౌద్ధ కళాఖండాల



హౌవశేషాలకు సంబంధించిన మ్యూజియంని సందర్శించి ఆసక్తిగా తిలకించారు. తదుపరి ఏర్పాటు చేసిన హౌసమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఫణిగిరి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన బౌద్ధ వారసత్వ కేంద్రాల్లో ఒకటని హౌర్కొన్నారు. బౌద్ధల యొక్క ధర్మం, శాంతి, అహింస, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిందని, బుద్ధుడు 29 సంవత్సరాల వయస్సులో హౌజ సౌఖ్యాలు వదిలేసి హౌదేశసంచారం చేస్తూ ప్రజలకు జ్ఞానోపదేశాలు చేశారని, మన కోరికలను అదుపులో ఉంచుకుంటే మనసు ప్రశాంతతగా ఉంటుందని, నేను, నాది అనే వాటిని వదిలివేసి మనం, మనది అనుకున్నప్పుడు బాధలు ఉండవని మన ఆలోచన విధానాలే మన కోరికలకు మూలమని బోధించిన బుద్ధుని బోధనలు మరువ వద్దని అన్నారు. ప్రజలు కూడా లేనిపోని ఆడంబరాలకు పోయి ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా నష్టపోవద్దని మంత్రి అన్నారు. హౌచారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక,పురావస్తు, వారసత్వ సంపద



పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బౌద్ధ పర్యాటక పటంలో తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకువస్తామనిఫణిగిరి, గాజులబండ వంటి బౌద్ధ క్షేత్రాల అభివృద్ధి ద్వారా తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక పటంలో మరింత ప్రముఖంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. తవ్వకాలలో వెలుగులోకి వచ్చిన శిల్పాలు, శాసనాలు, నాణేలు తెలంగాణ చరిత్ర వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని అన్నారు. పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.హౌమ్మెల్యే హౌందుల సామేల్ హౌట్లాడుతూ ఇది బుద్ధుడు నడయాడిన పవిత్ర నేలని, దీనిని ఇంకా అభివృద్ధి చేసుకొనే బాధ్యత మనందరి మీద ఉన్నదని ప్రభుత్వం నుండి ఇంకా నిధులు మంజూరు చేసి మెయిన్ రోడ్డు నుండి ఫణిగిరి గుట్ట వరకు హౌబుల్ రోడ్డు మంజూరు చేయవలసిందిగా మంత్రిని కోరగా, హౌమ్మెల్యే విజ్ఞప్తి పై వెంటనే స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఫణిగిరి బౌద్ధ క్షేత్ర సమగ్ర అభివృద్ధికి



రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో ప్రధాన రహదారి నుంచి క్షేత్రానికి చేరుకునే డబుల్ రోడ్డు నిర్మాణం, కొండపైకి వెళ్లేమెట్లదారి నిర్మాణం, టాయిలెట్స్, పర్యాటక మౌలిక సదుపాయాల కల్పన, సందర్శకుల వసతుల మెరుగుదల చేపట్టనున్నట్లు తెలిపారు. తదుపరి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హౌట్లాడుతూ హౌణిగిరి చరిత్ర ఎంతో గొప్పదని, అలాంటి చరిత్రను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఇలాంటి బౌద్ధ కట్టడాలు మన జిల్లాలో ఉండటం మన జిల్లాకు గర్వకారణం అని హౌ భవిష్యత్తులో సూర్యాపేట జిల్లాను పర్యటక ప్రాంతంగా హౌభివృద్ధి చేయుటకు ఫణిగిరి క్షేత్రం దోహదపడుతుందని హౌలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, డిప్యూటీ డైరెక్టర్లు పగడం నాగరాజు, నర్సింగ్ నాయక్, ఓఎస్డీ రాజు, అసిస్టెంట్ డైరెక్టర్లు నాగలక్ష్మి, మల్లు నాయక్, ఫణిగిరి, హౌగాజులబండ గ్రామాల సర్పంచులు ఎర్ర సావిత్రి, వంగూరు దామోదర్ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భవిష్యత్ నగరంగా ధోలేరా.. పెట్టుబడిదారుల పరిశీలన

- హైదరాబాద్‌లో ధోలేరా అవకాశాలపై ఇన్వెస్టర్ మీట్
- అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక వసతులపై అవగాహన
- దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశాలను వివరించిన నిర్వాహకులు

**శేరిలింగంపల్లి, జూన్ 22 :** గుజరాత్‌లో అభివృద్ధి చెందుతున్న ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఎస్ఐఆర్)లో పెట్టుబడి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు నెస్టోరియా ఫార్చ్యూన్ పార్క్ ఆధ్వర్యంలో ఆదివారం గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో ఇన్వెస్టర్ మీట్ నిర్వహించారు. సమావేశంలో ధోలేరా ప్రాంత అభివృద్ధి దిశ, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక అవకాశాలు, భవిష్యత్ వృద్ధి అవకాశాలపై పెట్టుబడిదారులకు సవివరంగా వివరించారు. దేశంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన పారిశ్రామిక నగరాల్లో ధోలేరా ఒకటిగా రూపుదిద్దుకుంటోందని నిర్వాహకులు తెలిపారు. ఢిల్లీ--ముంబై ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతం సుమారు 920 చదరపు




కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉందని పేర్కొన్నారు. సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెరుగుతున్న అవకాశాలు ఈ ప్రాంతాన్ని పెట్టుబడిదారుల దృష్టిలోకి తీసుకువస్తున్నాయని వివరించారు. అహ్మదాబాద్--ధోలేరా ఎక్స్‌ప్రెస్‌వే, రైలు అనుసంధానం, నీటి సరఫరా వ్యవస్థలు, విద్యా--ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధితో పాటు నివాస, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న ప్రణాళికలను సమావేశంలో వివరించారు. అభివృద్ధి రూపకల్పనకు సంబంధించిన వివరాలు, ప్రత్యక్ష సైట్ వీడియోలను ప్రదర్శించగా హాజరైన పెట్టుబడిదారులు వివిధ అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. భవిష్యత్ పెట్టుబడి ప్రణాళికల్లో కేవలం భూమి లేదా ధరలకే పరిమితం కాకుండా ప్రాంత అభివృద్ధి, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక విస్తరణ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు సూచించారు. హైదరాబాద్‌కు చెందిన పెట్టుబడిదారులు దీర్ఘకాలిక అవకాశాలను అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

## పీసీసీ పేరు చెప్పి దర్జాగా కల్లు వ్యాపారం

- మహేష్ కుమార్ గౌడ్ మంచితనాన్ని వాడుకుంటున్న వైనం
- పీసీసీకి తాము విద్యులమంటూ అధికారులకు బెదిరింపులు

**ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ జూన్ 22:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేరు చెప్పి నిజాంబాద్ జిల్లా తో పాటు ఆర్మూర్ నియోజకవర్గంలో కొందరు కల్లు వ్యాపారులు అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. మహేష్ కుమార్ గౌడ్ కు తాము దగ్గర బంధువులమంటూ ఎక్సైజ్ అధికారులను, పోలీస్ అధికారులను బెదిరిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారు. మహేష్ కుమార్ గౌడ్ మంచితనాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు కల్లు వ్యాపారులు ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. విచ్చలవిడిగా మందు కలుపుతూ వ్యాపారాన్ని నిర్వహిస్తూ దాడులు చేసే అధికారులకు తాము మహేష్ కుమార్ గౌడ్ కు సన్నిహితులమని బ్లాక్ మెయిల్ చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. కొంతమంది అధికారులు ధైర్యం చేసి కేసులు పెడితే బినామీ నాయకుల ద్వారా ఫోన్ చేయించి తాను మహేష్ కుమార్ గౌడ్ ను మాట్లాడుతున్నానని కేసులు పెట్టినవారు తమకు సన్నిహిత బంధువులని చెప్పించడం పరిపాటిగా మారింది. కిందిస్థాయిలో ఎంత పెద్ద గోరం జరుగుతుందో రాష్ట్రస్థాయిలో ఉన్న మహేష్ కుమార్ గౌడ్ కు ఈ విషయాల గురించి తెలియకపోవడం బాధాకరం. మంచి మనసు కలిగిన మహేష్ కుమార్ గౌడ్ మంచితనాన్ని ఆసరుగా చేసుకొని కొందరు కల్లు వ్యాపారులు దర్జాగా తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న నాయకుడి కారణంగా కిందిస్థాయిలో ఎంత దారుణం జరిగిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. మృదుస్వభావి అయినా మహేష్ కుమార్ గౌడ్ కిందిస్థాయిలో జరుగుతున్న విషయాల పై దృష్టి సారించి తన పేరు బదనాము కాకుండా చూసుకోవాలని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# ఫిఫా వరల్డ్‌కప్‌లో చరిత్ర సృష్టించిన ఈజిప్ట్

## న్యూజిలాండ్‌పై ఈజిప్ట్ 1–3 తేడాతో విజయం

2026 ఫిఫా వరల్డ్‌కప్‌లో ఈజిప్ట్ చరిత్ర సృష్టించింది. వరల్డ్‌కప్‌లోనే తొలి విజయం నమోదు చేసింది. తాజాగా గ్రూప్ జీలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈజిప్ట్ 1–3 తేడాతో విజయం సాధించింది. ఫలితంగా ఫిఫా హిస్టరీలోనే తొలిసారి గెలుపు రుచి చూసింది.

దీంతో ఈజిప్ట్ అభిమానుల సంబరాలకు హద్దుల్లేకుండా పోయాయి. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో ఈజిప్ట్ 1934లో ఎంట్రీ ఇచ్చింది. అప్పట్నుంచి 92 ఏళ్లు గడిచినా ఈ మ్యాచ్‌కు ముందు ఒక్క విజయం కూడాసాధించలేదు. కానీ తాజా మ్యాచ్‌లో జికో, సలాహ్, ట్రెజెగెట్ అద్భుతమైన రీతిలో గోల్స్ సాధించడంతో ఫిఫాలో తొలి విజయం అందుకోగలిగింది. ఇది ఈజిప్ట్ ఫుట్‌బాల్ చరిత్రలో నిలిచిపోనుంది! వాంకోవర్‌లోని దీజ ప్లేస్ గ్రౌండ్‌లో న్యూజిలాండ్‌ను ఈజిప్ట్ ఢీ కొట్టింది. అయితే ఈజిప్ట్ కంటే మెరుగైన న్యూజిలాండ్ జట్టు ఆటను దూకుడుగానే ప్రారంభించింది. ఆరంభంలోనే కివీస్ ప్లేయర్లు సర్‌ప్రీత్ సింగ్, ఎలిజా జస్ట్ గోల్స్ చేసేందుకు ప్రయత్నించినా ఈజిప్ట్ అడ్డుకుంది. అయితే 15వ నిమిషంలో కార్నర్ నుంచి వచ్చిన బంతిని ఫిన్ సుర్మాన్ బుల్లెట్ వేగంతో గోల్ చేసి న్యూజిలాండ్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. దీనికి ఈజిప్ట్ కూడా గట్టిగానే బదులిచ్చింది. స్కోరును సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. అయితే ఫస్టాఫ్ ముగిసే ముగింట సలాహ్, ఇమామ్ అషూర్ ఇద్దరూ గోల్ చేసేందుకు దగ్గరగా వచ్చారు. కానీ న్యూజిలాండ్ అడ్డుకోవడంతో 1–0తో ఈజిప్ట్ వెనుజంలో తొలి భాగం ముగించింది. అయితే సెంకడ్ హాఫ్‌లో ఈజిప్ట్ అద్భుతంగా పోరాడింది. ఆట ప్రారంభమైన కొద్ది సేపటికే న్యూజిలాండ్ మరో గోల్‌కు దగ్గరగా వెళ్లింది. కాలమ్ మెక్‌కోవాట్ తలతో కొట్టిన బంతిని, ఈజిప్ట్ గోల్ కీపర్ మోస్తఫా షోబీర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. అనంతరం ఈజిప్ట్ ఆటగాడు జీకో ఫ్రీ హెడర్ (58వ నిమిషం) గోల్ కొట్టి స్కోర్లను సమం చేశాడు. ఆ తర్వాత తొమ్మిది నిమిషాలకే సలాహ్ (67వ ని) బంతిని నెట్‌లోకి పంపించి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు.

దీంతో ఈజిప్ట్ సంబరాల్లో మునిగిపోయింది. ఈ లీడ్‌ను అలాగే కాపాడుకుంటూ ఈజిప్ట్ మ్యాచ్ ఎండింగ్ దాకా తీసుకెళ్లింది. ఆట ముగియడానికి ఎనిమిది నిమిషాలు ఉండగా ఈజిప్ట్ తరఫున ట్రెజెగెట్ (82 వ ని) మూడో గోల్ చేసి విజయాన్ని జట్టుకు విజయం ఖరారు చేశాడు. దీంతో ఈజిప్ట్ సంబరాల్లో మునిగిపోయింది. తాజా విజయంతో ఈజిప్ట్ గ్రూప్ జీ పాయింట్ల పట్టికలో టాప్‌లోకి దూసుకెళ్లింది. దీంతో నాకౌట్ దశకు చేరువైంది. రెండు మ్యాచ్‌ల్లో ఒక డ్రా, ఒక గెలుపుతో ఈజిప్ట్ ఖాతాలో ప్రస్తుతం నాలుగు పాయింట్లు ఉన్నాయి. మరోవైపు ఈ ఓటమితో నాలుగో స్థానంలో (1 పాయింట్) ఉంది. ఇరాన్ రెండో (2 పాయింట్లు), బెల్జియం (2 పాయింట్లు)మూడో ప్లేస్‌లో ఉన్నాయి.

అలాగే సోమవారం జరిగిన ఉరుగ్వే– కేప్ వెర్డే మ్యాచ్ 2– 2తో డ్రాగా ముగిసింది. ఈ ఫిఫాలో తొలిసారి ఆడుతున్న కేప్ వెర్డే వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అద్భుత ప్రదర్శనతో ఆశ్చర్యానికి గురిచేసింది. గత వారం టోర్నమెంట్ ఫేవరెట్ స్పెయిన్‌కు షాకిచ్చిన ఈ పసికూన, తాజాగా రెండుసార్లు ప్రపంచ కప్ విజేత ఉరుగ్వేపై కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. ఫస్టాఫ్‌లో ఉరుగ్వే రెండు గోల్స్, కేప్ వెర్డే ఒక గోల్ సాధించాయి. ఆ జట్టు తరఫున అరావ్జో (44వ), అగస్టిన్ కానోబియో (45o6 వ) నిమిషంలో, కేప్ వెర్డే (21 వ) గోల్స్ సాధించారు. దీంతో తొలి అర్ధ భాగం లో ఉరుగ్వే 2–1తో లీడ్‌లో నిలిచింది. సెకండాఫ్ లో కేప్ వెర్డే పుంజుకున్న తీరు అద్భుతం. ఆ జట్టు హీలియో వరేలా (61 వ) నిమిషంలో గోల్ సాధించి స్కోర్లను సమం చేసింది. ఆ తర్వాత ఏ జట్టు గోల్ చేయకపోవడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. ఈ మ్యాచ్‌కు ముందు జరిగిన బెల్జియం– ఇరాన్ గేమ్ 0–0 తో డ్రా అయ్యింది.

# సెక్యూరిటీ గార్డ్ దురుసు ప్రవర్తనపై రోహిత్ అసంతృప్తి

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి అభిమానుల మనసులను గెలుచుకున్నాడు. అఫ్గాన్‌తో వన్డే సిరీస్‌ను ముగించుకున్న రోహిత్ శర్మ.. ఇటీవలే తన స్వస్థలం ముంబైకి చేరుకున్నాడు. అయితే ముంబై విమానాశ్రయంలో అభిమానులు సెల్ఫీల కోసం రోహిత్ చుట్టుముట్టారు. ఈ క్రమంలో రోహిత్ శర్మకు దగ్గరగా వచ్చిన ఓ అభిమానిని సెక్యూరిటీ గార్డ్ పక్కకు నెట్టేశాడు. సెక్యూరిటీ గార్డ్ దురుసు ప్రవర్తనపై రోహిత్ శర్మ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. సదరు సెక్యూరిటీ గార్డ్ వైపు కోపంగా చూస్తూ మందలించాడు. అభిమానులను అలా ట్రీట్ చేయవద్దని సూచించాడు. ఈ చర్యతో ఫ్యాన్స్ పట్ల తనకు ఉన్న ప్రేమను చాటుకున్నాడు. ఈ ఘటనను ఫొటోగ్రాఫర్ పల్లవ్ బలివాల్ వీడియో తీసి సోషల్ మీడియాలో పంచుకున్నాడు. ఈ వీడియో కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. రోహిత్ శర్మపై అభిమానులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.అఫ్గానిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌లో రోహిత్ శర్మ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. తొలి మ్యాచ్‌లో 16 పరుగులతో రనౌట్‌గా వెనుదిరిగినా.. రెండో మ్యాచ్‌లో 48, మూడో మ్యాచ్‌లో 79 పరుగులతో రాణించాడు. ఈ సిరీస్‌ను భారత్ 3–0తో క్లీన్ స్వీప్ చేసింది.అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు



పలికిన రోహిత్ శర్మ కేవలం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్న సంగతి తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇంగ్లండ్‌తో జులైలో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో రోహిత్ మళ్లీ బరిలోకి దిగనున్నాడు. అయితే అఫ్గానిస్థాన్‌తో సిరీస్‌లో రాణించడం రోహిత్ శర్మకు ఉపశమనం కలిగించిందని మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా అన్నాడు.ఇంగ్లండ్ పర్యటనలో రోహిత్ ప్రశాంతంగా ఆడుతాడని చెప్పాడు. 'ఎంత గొప్ప ఆటగాడికైనా పరుగులు చేయడం అవసరం. రోహిత్ బ్యాటింగ్ చేసిన తీరు అతని గొప్ప సామర్థ్యాన్ని చూపించింది. అతను పరుగులు చేయడం చాలా ముఖ్యం. టీమ్‌మేనేజ్‌మెంట్ అతనికి నిరంతరం మద్దతు ఇస్తున్నప్పటికీ ఒక ఆటగాడిగా పరుగులు చేయనప్పుడు ఒత్తిడి పెరుగుతుంది. ఫామ్ అందుకోవడం రోహిత్‌కు ఉపశమనం ఇచ్చి ఉంటుంది. ఇంగ్లండ్‌లో మరింత స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగలడు. అక్కడి పిచ్‌లు కూడా రోహిత్ బ్యాటింగ్‌కు సరిగ్గా సరిపోతాయి. బ్యాటింగ్‌లోనే కాకుండా ఫీల్డింగ్‌లోనూ రోహిత్ అదరగొట్టాడు. వరుసగా మూడు క్యాచ్‌లు అందుకున్నాడు. ఇప్పుడు అతను మనశ్శాంతితో ఇంగ్లండ్‌కు వెళ్లవచ్చు.'అని జియో హాట్‌స్టార్ షోలో పుజారా అన్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా జూలై 14 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది.

# ఇంగ్లాండ్ జట్టులోకి స్టోక్స్ అడుగు

న్యూజిలాండ్‌తో జూన్ 25 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ప్రారంభం కానున్న మూడో టెస్టు కోసం ఇంగ్లాండ్ జట్టులోకి బెన్ స్టోక్స్, గస్ అట్కిన్సన్ తిరిగి వచ్చారు. లండన్ నైట్ క్లబ్‌లో రగ్బీ ఆటగాడితో ఘర్షణ పడి ఈసీబీ నిబంధనలు ఉల్లంఘించినందుకు వీరిని రెండో టెస్టుకు దూరం పెట్టారు. ప్రస్తుతం సిరీస్ 1–1తో సమం కావడంతో, ఈ నిర్ణయాత్మక ఆఖరి టెస్టులో బెన్ స్టోక్స్ తిరిగి కెప్టెన్‌గా ఇంగ్లాండ్ జట్టును నడిపించనున్నాడు. న్యూజిలాండ్‌తో జూన్ 25 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ప్రారంభం కానున్న మూడో టెస్టుకు ఇంగ్లాండ్ జట్టులో బెన్ స్టోక్స్ , గస్ అట్కిన్సన్ జట్టులో చోటు దక్కించుకున్నారు. తొలి టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించిన తర్వాత లండన్ నైట్ క్లబ్‌లో జరిగిన సంఘటన తరువాత వీరిద్దరినీ జట్టు నుంచి తప్పించారు. కానీ మూడో టెస్టుకు ముందు వీరిద్దరూ తిరిగి జట్టులోకి వచ్చారు. బెన్ స్టోక్స్ తిరిగి సారథ్య బాధ్యతలు చేపడతాడని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ధ్రువీకరించింది.కాగా లార్డ్స్‌తో



న్యూజిలాండ్‌తో టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత జూన్ 8న స్టోక్స్, అట్కిన్సన్ ఇద్దరూ ఓ నైట్ క్లబ్‌కు వెళ్లారు. నిజానికి ఇలా వెళ్లేందుకు వారికి అనుమతి లేదు. అయినా ఈసీబీ నిబంధలను ఉల్లంఘించి వారు అక్కడికి వెళ్లారు. నైట్ క్లబ్‌లో రగ్బీ ఆటగాడు టోటోవా ఔవాతో వీరు ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఓ సెక్యూరిటీ సిబ్బందికి కూడా గాయాలు కావడంతో విషయం ముదిరింది. దీంతో వారిని జట్టు నుంచి తప్పించారు. ఆ తర్వాత బెన్ స్టోక్స్, అట్కిన్సన్ వెళ్లి కౌంటీల్లో ఆడారు. కానీ ఈసీబీ సూచన మేరకు కౌంటీల్లో తమ తర్వాతి మ్యాచుకు వీరు దూరమయ్యారు. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు కోసం ఎంపిక చేసిన జట్టులో చోటు సంపాదించారు. కాగా లార్డ్స్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లాండ్.. న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. కానీ రెండో టెస్టులో మాత్రం 253 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. దీంతో రెండు టెస్టులు ముగిసే సరికి సిరీస్ 1–1తో సమమైంది. నిర్ణయాత్మక మూడో టెస్టు జూన్ 25 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచు ఫలితం సిరీస్ విజేత ఎవరో తేల్చనుంది.



# కోహ్లీ టెస్టుల్లోకి రీఎంట్రీ ఇస్తాడా..?

స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన టెస్ట్ క్రికెట్ రీఎంట్రీ వార్తలకు పూర్తిగా తెరదించాడు. తన వన్8 బ్రాండ్ షూ లాంచ్ ఈవెంట్‌లో హోస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. టెస్ట్ క్రికెట్‌తో తన పని అయిపోయిందని స్పష్టం చేశాడు. కోహ్లీ తన టెస్ట్ కెరీర్‌లో చేసిన మొత్తం పరుగులు 9,230 కాగా, దానికి గుర్తుగా కొత్త షూ ధరను కూడా రూ. 9,230 గానే నిర్ణయించడం విశేషం. ప్రస్తుతం కోహ్లీ దృష్టి కేవలం వన్డే ఫార్మాట్ పైనే ఉంది. విరాట్ కోహ్లీ .. ప్రపంచ క్రికెట్‌లో పరిచయం అక్కర్లేని పేరు. ఎన్నో రికార్డులు అతడి సొంతం. ఛేజ్ మాస్టర్‌గా పేరుపొందిన విరాట్ కోహ్లీ.. భారత్‌కు ఎన్నో అపురూప విజయాలు అందించాడు. ప్రపంచ క్రికెట్‌లో రికార్డులు బద్దలు కొట్టాడు. అయితే ప్రస్తుతం కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే టీ20, టెస్టులకు గుడ్ బై చెప్పేశాడు కోహ్లీ. కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ 2027 కోహ్లీ కెరీర్‌లో చివరి ఈవెంట్ అయ్యే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. అయితే ఇటీవల కొన్ని వార్తలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. టెస్ట్ క్రికెట్‌కే ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కింగ్.. రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని మళ్లీ రీఎంట్రీ ఇస్తాడనే వార్తలు వస్తున్నాయి. అభిమానులు కూడా ఈ వార్తలు నిజం కావాలని కోరుకుంటున్నారు. అతడిలో ఇంకా క్రికెట్ ఉందని.. టెస్ట్ క్రికెట్‌కు అతడి అవసరం ఉందని పేర్కొంటున్నారు. అయితే ఇదే విషయంపై ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీకి ప్రశ్న ఎదురైంది. దీనికి అతడు తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. ఇటీవల కోహ్లీ స్పోర్ట్స్ బ్రాడ్ వన్8 లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఈ బ్రాండ్‌లో ఓ షూ ధర రూ. 9,230గా ఉంది. టెస్ట్ క్రికెట్‌లో కోహ్లీ సాధించిన పరుగులు సైతం 9,230 కావడం గమనార్హం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ హోస్ట్.. కోహ్లీని ఉద్దేశించి ఓ ప్రశ్న అడిగాడు. "విరాట్ మీరు ఇంకొన్ని రన్స్ చేసి.. ఆ షూ లాభాలు పెంచొచ్చు కదా?" అని అడిగాడు. దీనికి కోహ్లీ "నేను తక్కువ ధరకే అమ్మేయడానికి ఇష్టపడతా. మీరు ఏదైతే అడుగుతున్నారో దానితో.. (టెస్ట్ క్రికెట్‌ను ఉద్దేశిస్తూ.. ) నా పని అయిపోయింది. థాంక్యూ" అని విరాట్ కోహ్లీ సమాధానమిచ్చాడు. కోహ్లీ సమాధానంతో అతడు మళ్లీ టెస్ట్ క్రికెట్‌లో ఆడబోడనే విషయం స్పష్టమైంది. కోహ్లీ.. త్వరలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంది.



# క్రిస్ గేల్‌కు కీరన్ పోలార్డ్ క్షమాపణలు

వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్, యూనివర్స్ బాస్ క్రిస్ గేల్‌కు ఆ జట్టు మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పోలార్డ్ క్షమాపణలు చెప్పాడు. క్రిస్ గేల్‌కు చెందిన 12 ఏళ్ల అరుదైన రికార్డ్‌ను కీరన్ పోలార్డ్ తాజాగా బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ వరల్డ్ రికార్డ్‌తో యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్‌కు కీరన్ పోలార్డ్ క్షమాపణలు తెలియజేశాడు.అమెరికా వేదికగా జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ 2026 సిరీస్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంఐ న్యూయార్క్ తరఫున ఆడిన పొలార్డ్ 56 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో 81 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద.. క్రిస్ గేల్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను అధిగమించాడు. 39 ఏళ్ల పొలార్డ్ ఇప్పటి వరకు 736 టీ20 మ్యాచ్‌లు ఆడి..14582 పరుగులు చేశాడు. 14,562 పరగులతో గేల్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.ఈ చారిత్రాత్మక రికార్డ్ అనంతరం మాట్లాడిన పోలార్డ్.. ఆసక్తిర వ్యాఖ్యలు చేశాడు. 'మేం ఎల్లప్పుడూ ఆదర్శంగా భావించే క్రిస్ గేల్ రికార్డ్‌ను బద్దలు కొట్టడం చాలా ప్రత్యేకమైనది. యూనివర్స్ బాస్.. నన్ను క్షమించండి. మనమిద్దం ఇప్పుడు అగ్రస్థానంలో ఉన్నాం. ఆరు లేదా ఏడో స్థానంలో బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. చాలా మంది అప్‌ది ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయాలనుకుంటారు. ఎవరో ఒకరు లోయర్ ఆర్డర్‌లో వచ్చి మ్యాచ్‌ను ముగించే కష్టమైన పనిని చేయాల్సి ఉంటుంది.నేను ఆ బాధ్యతనను సవాల్‌గా స్వీకరించాను. టెక్నాలజీలానే క్రికెట్ కూడా మారుతోంది. క్రికెట్ ఇప్పుడు కేవలం ఒక ఆట మాత్రమే కాదు. అదొక వ్యాపారం. మమ్మల్ని విమర్శించిన వారందరూ ఇప్పుడు మౌనంగా మా విజయాలను ఆస్వాదిస్తారని ఆశిస్తున్నా'అని కీరన్ పోలార్డ్ చెప్పుకొచ్చాడు. పొలార్డ్, గేల్, బ్రావో వంటి ఆటగాళ్లు అంతర్జాతీయ మ్యాచ్‌ల కంటే ఫ్రాంచైజీ లీగ్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు మాజీ క్రికెటర్లు వారిపై అప్పట్లో విమర్శలు గుప్పించారు.

# నా గురించి జనాలకు తెలియదు: వైభవ్ సూర్యవంశీ

తాను 50 ఓవర్ల క్రికెట్‌ను చాలా ఆడానని, ఆ విషయం జనాలకు తెలియదని టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ అన్నాడు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైనా తనపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశాడు. శ్రీలంక గడ్డపై ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్లో వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 11 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించి ప్రపంచ రికార్డ్‌ను నమోదు చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఇదే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ . శ్రీలంక ఆటగాడు కుశాల్య వీర రత్నే(12 బంతులు) 20 ఏళ్ల ముందు నెలకొల్పిన రికార్డ్‌ను వైభవ్ తాజా ఇన్నింగ్స్‌తో బద్దలు కొట్టాడు. ఈ సంచలన ప్రదర్శనతో భారత్-ఏ 66 పరుగుల తేడాతో విజయం



సాధించింది. భారత్-ఏ విజయంలో కీలక పాత్ర పోషించిన వైభవ్ సూర్యవంశీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మాట్లాడిన వైభవ్ సూర్యవంశీ తనపై వచ్చిన విమర్శలపై స్పందించాడు. అలాగే ఈ సిరీస్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నట్లు వెల్లడించాడు. 'రికార్డ్ గురించి నాకు తెలియదు. దాని గురించి ఆలోచించ లేదు. నా ప్రణాళికలను మాత్రమే అమలు చేశా. తొలి 10 ఓవర్లలో ఎలా ఆడాలనుకున్నానో అదే చేసి చూపించా. నాపై ఎలాంటి ఒత్తిడి లేదు. ఈ సిరీస్ ఆరంభంలో నేను అనుకున్న విధంగా ఆడలేదు. కోచ్‌లతో మాట్లాడి.. రిథమ్‌ను అందుకొన్నా. నా తప్పిదాలను సరిదిద్దుకున్నా. నేను 50 ఓవర్ల క్రికెట్ చాలా ఆడా. ఆ విషయం ప్రజలకు తెలియదు. విభిన్న పరిస్థితుల్లో ఎదురయ్యే సవాళ్లను తీసుకోవడం ఇష్టపడతా. ఇప్పుడు ఫైనల్లో మంచి ఇన్నింగ్స్ ఆడటం బాగుంది.'అని వైభవ్ సూర్యవంశీ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 377 పరుగుల భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ(29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్స్‌లతో 94) తృటిలో శతకం చేజారగా.. తిలక్ వర్మ(90 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 67) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు.

# బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పు చేయాలి: మిథాలీ రాజ్ సూచన

ఆదివారం ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో దక్షిణాఫ్రికాతో జరిగిన ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ ఓటమిపై భారత బ్యాటింగ్ దిగ్గజం మిథాలీ రాజ్ స్పందిస్తూ.. టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో ఒక చిన్న మార్పు చేయాలని సూచించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను 5వ స్థానానికి బదులుగా 4వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపించాలని, అలాగే జెమిమా రోడ్రిగ్స్‌ను 5వ స్థానంలో ఆడించాలని ఆమె ప్రతిపాదించారు.ఈ మ్యాచ్‌లో గెలిచి ఉంటే భారత్ గ్రూప్–ఎ పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని, సెమీఫైనల్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకునేదని, కానీ ఈ ఓటమితో ఇకపై టోర్నమెంట్‌లో భారత్‌కు తప్పులు చేసే అవకాశం లేదని మిథాలీ పేర్కొన్నారు. మిథాలీ రాజ్ మాట్లాడుతూ--- "భారత్‌కు ఇది నిరాశాజనకమైన మ్యాచ్. ఈ మ్యాచ్ గెలిచి ఉంటే పట్టికలో అగ్రస్థానంలో నిలిచేవారు. కానీ ఇప్పుడు సెమీస్‌కు చేరాలంటే ఆస్ట్రేలియాపై ఖచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి వచ్చింది. బ్యాటింగ్ ఆర్డర్ పరంగా చూస్తే, హర్మన్‌ప్రీత్ కౌర్ 5వ స్థానంలో అంత లేట్‌గా బ్యాటింగ్‌కు రావడం మనం తరచుగా చూడలేదు. కాబట్టి ఆమె



4వ స్థానంలో, జెమిమా 5వ స్థానంలో వస్తే బాగుంటుంది.

జెమిమా గతంలో 5వ స్థానంలో ఆడి చాలా పరుగులు చేసింది. ఆమె క్రీజులోకి వచ్చే సమయానికి స్పిన్నర్లు బౌలింగ్ చేసే అవకాశం ఉంటుంది. స్పిన్‌ను ఆడటం జెమిమా బలం. ఆమె క్రీజు వెలుపలికి వచ్చి ఆడటంతో పాటు స్కూప్స్, స్వీప్ షాట్లు బాగా ఆడుతుంది.

హర్మన్‌ప్రీత్ ముందుగా వచ్చి, ఆ తర్వాత జెమిమా వస్తే ఆమెకు ఫామ్‌లోకి రావడానికి, మంచి రిథమ్ అందుకోవడానికి సహాయపడుతుంది" అని అన్నారు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 158 పరుగుల పోటీతత్వ స్కోరు సాధించి మ్యాచ్‌పై పట్టు సాధించినట్లే కనిపించింది. అయితే దక్షిణాఫ్రికా బ్యాటర్ మరిజానే కాప్ కేవలం 45 బంతుల్లోనే 81 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి, చివరి ఓవర్లో తన జట్టును గెలిపించింది. ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇది మొదటి ఓటమి. దీంతో నాకౌట్ దశకు వెళ్లే మార్గం క్లిష్టంగా మారింది.మ్యాచ్ ఓడిపోయినప్పటికీ, యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి ప్రదర్శనను మిథాలీ రాజ్ ప్రత్యేకంగా అభినందించారు. శ్రీ చరణి ఒకే ఓవర్లో రెండు కీలక వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను 25/2 స్కోరు వద్ద దెబ్బతీసి భారత్‌ను తిరిగి మ్యాచ్‌లోకి తెచ్చింది. శ్రీ చరణి గురించి మిథాలీ మాట్లాడుతూ--- "శ్రీ చరణి త్వరగా నేర్చుకునే ఆటగాడు. ఇంగ్లండ్ వాతావరణంలోనే ఆమె అరంగేట్రం చేసింది కాబట్టి ఇక్కడి పరిస్థితులపై ఆమెకు అవగాహన ఉంది. పిచ్ నుండి స్పిన్నర్లకు పెద్దగా సహకారం లేకపోయినప్పటికీ, ఆమె స్థిరంగా స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బౌలింగ్ చేసింది. వేగాన్ని, లెంగ్త్‌ను మారుస్తూ తనకు కావాల్సిన ఫీల్డింగ్‌ను సెట్ చేసుకుంది. రెండో స్పెల్‌లోనూ ఆమె చాలా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పరుగులను నియంత్రించింది" అని కొనియాడారు. రెండు క్యాచ్‌లు డ్రాప్ అవ్వడం, కాప్ అద్భుత బ్యాటింగ్ కారణంగా భారత్ మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది.

# ఘనంగా "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" మూవీ సక్సెస్ మీట్

## దర్శకుడు పి.సునీల్ కుమార్ రెడ్డి మంచి ప్రయత్నాన్ని అభినందించిన అతిథులు

సామాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిల్మ్స్ బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా గే, ట్రాన్స్జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా "ఎల్ జి బీ టీ – ఏ లీగల్ బ్యాటిల్". ఈ చిత్రంలో ఎల్ బి శ్రీరామ్, ఎస్తర్ నార్హోన్హ, రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్ తో పాటు రియల్ ట్రాన్స్జెండర్ యాక్టర్స్ ప్రధాన పాత్రలు పోషించారు. హిమ రాథోడ్ హీరోయిన్ గా చంద్రముఖి , లైలా వంటి ప్రముఖ యాక్టివిస్టులు , గే యాక్టివిస్ట్ విష్ణు తేజ చాలా పరిణితితో నటించారు. "ఎల్ జి బీ టీ – ఏ లీగల్ బ్యాటిల్" సినిమా ఈ నెల 19న దేశవ్యాప్తంగా విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గే, ట్రాన్స్ జెండర్స్ కు అండగా నిలుస్తున్న పలు సేవా సంస్థల నిర్వాహకులను సత్కరించారు. ఈ సందర్భంగా నటుడు ఆనంద చక్రపాణి మాట్లాడుతూ – ఎన్నో రకాల సినిమాలు వస్తుంటాయి కానీ ఇలాంటి కథతో సినిమా చేయాలంటే ధైర్యం ఉండాలి. మనం చాలా సమస్యల్ని మనకెందుకు అని చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటాం. ప్రశ్నించాలని అనుకోం.



కానీ దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి గారు సినిమా అనే బలమైన మాధ్యమం ద్వారా సొసైటీలో ఉన్న ఈ రుగ్మత గురించి ఆలోచింపజేసేలా సినిమా రూపొందించారు. ఈ సినిమా చూస్తుంటే చాలా సన్నివేశాల్లో కన్నీళ్లు వచ్చాయి. ఇలాంటి మంచి ప్రయత్నాన్ని ప్రేక్షకులు మరింతగా ఆదరించాలి. అన్నారు. గే కమ్యూనిస్ట్ యాక్టివిస్ట్ విష్ణు మాట్లాడుతూ – మా సినిమా ప్రదర్శితమవుతున్న థియేటర్స్ లో హౌస్ ఫుల్స్ బోర్డ్స్ చూడటం సంతోషంగా ఉంది. సునీల్ కుమార్ రెడ్డిగారు ఒక మంచి విషయాన్ని ప్రేక్షకులకు, సొసైటీకి చెప్పాలని అనుకున్న ఉద్దేశం నెరవేరిందని అనిపిస్తోంది. కాలేజ్ స్టూడెంట్స్, టీచర్స్, పలు ఆర్గనైజేషన్స్ వాళ్లు మా మూవీ చూస్తున్నారు. సినిమా చూశాక వారిలో మా లాంటి వాళ్ల పట్ల ఒక కొత్త పర్సెప్షన్ కనిపిస్తోంది. ఇలాంటి మార్పు రావాలనే సునీల్ కుమార్ రెడ్డిగారు "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమా రూపొందించారు. అన్నారు. తెలంగాణ స్టేట్ ట్రాన్స్ జెండర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లైలా మాట్లాడుతూ – "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్ చెబుతున్నాం. నేను ఈ సినిమాలో భాగమవడం సంతోషంగా ఉంది. నాకు ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన సునీల్ కుమార్ రెడ్డి గారికి కృతజ్ఞతలు. మా సమస్యల్ని చెప్పే ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలి. అప్పుడే సమాజంలో మరికొంత మార్పు అనేది మొదలవుతుంది. ఈ సినిమా చూడని వారు తప్పకుండా చూడండి. అన్నారు. నటుడు వంశీకృష్ణ మాట్లాడుతూ – ఎన్నో సినిమాల ఈవెంట్స్ చూసేందుకు ఇక్కడికి వచ్చినవాడిని. ఇప్పుడు మా సినిమా ఈవెంట్ లో నేను ఈ వేదిక మీద నిల్చుని మాట్లాడటం గర్వంగా ఉంది. మీ సినిమాను ప్రేక్షకులు చూస్తారా అని రిలీజ్ కు ముందు కొందరు అన్నారు. కానీ మంచి ప్రయత్నం చేసిన ప్రతి సినిమాను ఆదరిస్తామని ఆడియెన్స్ మరోసారి ప్రూవ్ చేశారు. అన్నారు. నటుడు ఎల్బీ శ్రీరామ్ మాట్లాడుతూ – ఈ సినిమాతో సునీల్ కుమార్ రెడ్డి గారు ఒక చరిత్ర సృష్టించారు. గే, ట్రాన్స్ జెండర్ సమస్యలు చెబుతూ వచ్చిన ఫస్ట్ సినిమా ఇదే. ఆ తర్వాత ఎన్ని చిత్రాలు వచ్చినా దీని తర్వాతే. శంకరాభరణం సినిమా ఒక చరిత్ర సృష్టించింది. ఈ అర్ధనారీశ్వర సినిమా మరో చరిత్ర సృష్టించబోతోంది. ఈ సినిమాను సింగిల్ స్క్రీన్స్, మల్టిప్లెక్సుల్లో చూశాను. అన్ని వర్గాల ప్రేక్షకులు చూసేందుకు వస్తున్నారు. వీళ్ల ఆర్గనైజేషన్స్, మీడియా, సివిల్ సొసైటీలు, అన్నీ కలిసి "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" చిత్రానికి పెద్ద విజయం చేకూర్చాయి. ఇందుకు సునీల్ కుమార్ రెడ్డి గారిని అభినందిస్తున్నా. నా కెరీర్ లో అమ్మో ఒకటో తారీఖు ఎలా గుర్తుండిపోతుందో ఈ "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమా కూడా అలాగే గుర్తుండిపోతుంది. అన్నారు. ట్రాన్స్ జెంటర్ ఇన్ స్టాగ్రామ్ యాక్టివిస్ట్ హీరోయిన్ హిమ రాథోడ్ మాట్లాడుతూ – గత మూడు రోజులుగా మా "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇంత రెస్పాన్స్ ప్రేక్షకుల నుంచి వస్తుందని ఊహించలేదు. నేను సునీల్ కుమార్ రెడ్డిగారు ఇచ్చిన అవకాశంతో ఈ సినిమాలో హీరోయిన్ గా నటించాను. మేము మా జీవితంలో ఎదుర్కొంటున్న సవాళ్లను నా పాత్ర ద్వారా దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి గారు చూపించారు. ఈ సినిమాను మరింతగా సక్సెస్ చేయాలని కోరుతున్నా. అన్నారు. డైరెక్టర్ పి.సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ – మా "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమాను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్ చెబుతున్నాం. ఎన్నో ఆర్గనైజేషన్స్, మీడియా మిత్రులు, ఛారిటీ సంస్థలు మా మూవీని ప్రశంసిస్తున్నాయి. ఈ సినిమా రూపొందించడం వెనక ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ట్రాన్స్ జెండర్స్ విషయంలో ఉన్న వివక్ష తొలగిపోవాలని, వారికీ సమానత్వం ఉండాలని చెప్పేందుకు ఈ "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమాను రూపొందించాను. సినిమా ప్రదర్శితమవుతున్న అన్ని థియేటర్స్ లో మంచి రెస్పాన్స్ రావడం హ్యాపీగా ఉంది. మా మూవీని మరింతగా ఆదరించాలి, ఈ సినిమాతో సొసైటీలో ఒక మంచి మార్పునకు అడుగుపడాలని కోరుకుంటున్నా. అన్నారు.



### #NBK112 అమరావతిలో జూన్ 25న గ్రాండ్ లాంచ్- ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్

గాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంచలన దర్శకుడు కొరటాల శివ తొలిసారిగా #NBK112 చిత్రం కోసం జతకడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అభిమానులు, సినీ వర్గాల్లో భారీ అంచనాలు పెంచింది. "Power Meets Purpose, Mass Becomes A Movement" అనే పవర్ ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన అనౌన్స్‌మెంట్ పోస్టర్, ఈ చిత్రం ఎంత భారీ స్థాయిలో ఉండబోతుందో సూచించింది. ఇద్దరు విజయవంతమైన నిర్మాతలు SLV సినిమాస్ సుధాకర్ చెరుకూరి, యువసుధ ఆర్ట్స్ సుధాకర్ మిక్కిలినేని ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న అంచనాలను మరింత పెంచుతూ, అమరావతి సమీపంలోని వెంకటాయపాలెంలో ఉన్న TTD ఆలయంలో జూన్ 25న గ్రాండ్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానుండటంతో ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది. బాలకృష్ణ భారీ స్థాయి స్క్రీన్ ఇమేజ్‌కు సరిపోయేలా కొరటాల శివ ఒక పవర్ ఫుల్ కథని సిద్ధం చేశారు. మాస్ సినిమాలు చేయడంలో ప్రసిద్ధి చెందిన ఇద్దరు దిగ్గజాలు తొలిసారిగా కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు.

# ఘనంగా "టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026" ప్రధానోత్సవ కార్యక్రమం

"టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026" ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జ్యూరీ ఛైర్ పర్సన్ ఇంద్రజ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎంట్రీలు పరిశీలిస్తుంటే కొత్త వారిలో ఎంత టాలెంట్ ఉందో చూసి ఆశ్చర్యపోయామని ఈ సందర్భంగా డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. ఈ యంగ్ టాలెంట్ కు ఇండస్ట్రీలో అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తామని ఆయన చెప్పారు. ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, వచ్చే ఏడాది నుంచి మొదటి బహుమతి లక్ష రూపాయలు అందిస్తామని డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్ సీసీ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ – తెలంగాణ ఏర్పడి 12ఏళ్లైన సందర్భంగా "టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026" నిర్వహించాలని ముందుకొచ్చాం. అవార్డ్స్ ప్రకటించిన 15 రోజుల్లోనే విజయవంతంగా కార్యక్రమం నిర్వహించగలిగాం. దాదాపు 60కి పైగా ఎంట్రీలు వచ్చాయి. జ్యూరీ ఛైర్ పర్సన్ ఇంద్రజ గారు ఎంట్రీలను శ్రద్ధగా పరిశీలించి, ప్రతి షార్ట్ ఫిలింను చూసి విజేతలను ఎంపిక చేశారు. ఆమెను చూస్తే జ్యూరీ ఛైర్ పర్సన్ అంటే ఇలా ఉండాలి అనిపించింది.



ఎంట్రీలు పంపిన వారంతా యంగ్ స్టర్స్. వారి ప్రతిభ చూసి ఆశ్చర్యపోయాం. వారు షూటింగ్ తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ఎంతో క్వాలిటీతో చేశారు. వారికి ఉన్న వనరుల్లో ఇంతమంచి క్వాలిటీతో చేయడం అభినందనీయం. వారికి ఇండస్ట్రీలో అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తాం. ఈ ఏడాది ముందుగా ప్రకటించిన దానికంటే మరింత నగదు బహుమతి జోడించి, మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి 15 వేలు, మూడవ బహుమతి 10వేలు అందించాము.వచ్చే ఏడాది మొదటి బహుమతిని లక్ష రూపాయలు, రెండవ బహుమతి 50వేలు, మూడవ బహుమతి 25వేలు అందిస్తాం. అవార్డ్స్ కు ఎంపిక కాని వారు బాగా చేయలేదని కాదు, వారు కూడా బాగా చేశారు అయితే అవార్డ్స్ కొందరికే ఇవ్వగలం. తెలంగాణ ఫిలించాంబర్ తరుపున ఫిలిం స్కూల్ కూడా పెట్టబోతున్నాం. ఈ అవార్డ్స్ కార్యక్రమ నిర్వహణలో నాకు ఎంతోమంది మిత్రులు, మీడియా ఫ్రెండ్స్ సపోర్ట్ చేశారు. వారందరికీ థ్యాంక్స్ అన్నారు. జ్యూరీ ఛైర్ పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ – కొత్త టాలెంట్ ను ఎంకరేజ్ చేయాలని మంచి ఉద్దేశంతో రామకృష్ణ గౌడ్ గారు "టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026" కార్యక్రమం చేపట్టారు. ఆయన డిస్ట్రిబ్యూటర్ గా, నిర్మాతగా, దర్శకుడిగా, నటుడిగా ఇండస్ట్రీలో సుదీర్ఘ ప్రయాణం సాగిస్తున్నారు. ఆగిపోయిన ఎన్నో సినిమాలను రిలీజ్ చేయించారు. కొత్త వారికి అవకాశాలు కల్పిస్తున్నారు. అలాంటి వ్యక్తి చేస్తున్న కార్యక్రమం కాబట్టి నేను జ్యూరీ ఛైర్ పర్సన్ గా ఉండేందుకు ముందుకొచ్చాను. సినిమా అనేది మీ కల, మీరు కోరుకునే భవిష్యత్తు. అందుకే జాగ్రత్తగా ప్రతి ఎంట్రీని పరిశీలించి అవార్డ్స్ కు ఎంపిక చేశాం. విజేతలు కాని వారు కూడా ఏం తక్కువ కాదు. ఫస్ట్ మూడు అవార్డ్స్ ఇవ్వాలి కాబట్టి ముగ్గురిని సెలెక్ట్ చేశాం. ఇది చాలా పెద్ద బాధ్యతగా ఫీలయ్యాను. మీరు పెట్టుకున్న ఆశలు ఎంత విలువైనవో నాకు తెలుసు. నేను టీవీ కార్యక్రమాలు చేస్తున్నప్పుడు కూడా వారి టాలెంట్ చూసి సర్ ప్రైజ్ అయ్యాను. నాకు వీలైనంతగా ఎవరికైనా చెప్పి అవకాశాలు ఇప్పించాను. కానీ ఇలాంటి పెద్ద వేదిక ఉంటే ఎక్కువమందికి అవకాశాలు వస్తాయి. ఇది సరైన వేదిక. ఎంట్రీలు పంపిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మీరు పట్టుదలగా ప్రయత్నిస్తే తప్పకుండా ఇండస్ట్రీలో పేరు తెచ్చుకుంటారు. నాకు దక్కిన గుర్తింపు, సంపాదన అంతా ఇండస్ట్రీ ఇచ్చిందే. ఆ ఇండస్ట్రీకి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలనే ఈ కార్యక్రమంలో భాగమయ్యాను అన్నారు

# #చిరుబాబీ2 / #చిరు158 పొల్లాచ్చి షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్ లో #ChiruBobby2 / #Chiru158 చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'వాల్తేరు వీరయ్య' భారీ బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ విజయవంతమైన కాంబో మరోసారి చేతులు కలపడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే పొల్లాచ్చిలో మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్ర బృందం, ఈ రోజు హైదరాబాద్‌లో ఒక కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించింది. పొల్లాచ్చి షెడ్యూల్‌లో హై-వోల్టేజ్ యాక్షన్, ప్రధాన తారాగణం పాల్గొన్న కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ షెడ్యూల్ పూర్తి కావడాన్ని పురస్కరించుకుని 'బిహైండ్-ది-సీన్స్' (BTS) వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ వీడియోలో సెట్స్‌లో ఉన్న ఉత్సాహభరితమైన వాతావరణం, ప్రతి సన్నివేశం వెనుక ఉన్న ప్లానింగ్, సినిమాను ఎంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారో చూడవచ్చు. ఇందులో చిరంజీవి హుందాగా, హై ఇంటెన్స్ కూడిన లుక్‌లో కనిపిస్తుండగా, అనస్వర రాజన్, నివేదా పేతురాజ్ కూడా షూటింగ్‌లో పాల్గొనడం కనిపించింది. ఈ BTS వీడియోలో హైలెట్ గా నిలిచిన అంశం దర్శకుడు బాబీ కొల్లికి సంబంధించిన ఒక మూమెంట్. ఒక సన్నివేశంలో చిరంజీవి పూర్తిగా లీనమై నటించడాన్ని చూసి దర్శకుడు భావోద్వేగానికి లోనయ్యారు. మెగాస్టార్ అద్భుతమైన నటనను చూసి ముగ్ధుడైన ఆయన "జీవించేశారు అన్నయ్యా" అని ఉద్వేగంగా తన ఆనందాన్ని



వ్యక్తం చేశారు. దర్శకుడు బాబీ కొల్లి చిరంజీవిని ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా ఈ చిత్రంలో చూపించబోతున్నారు. తాజాగా విడుదలైన చేసిన వీడియోలో ఆయన రెస్పాన్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. పొల్లాచ్చి షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం కొత్త షెడ్యూల్ ను హైదరాబాద్ లో మొదలుపెట్టింది. కథకు వెన్నెముకగా నిలిచే కీలకమైన టాకీ పార్ట్స్, ప్రధాన యాక్షన్ ఘట్టాలను చిత్రీకరించనున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ చిత్రానికి అద్భుతమైన విజువల్స్ అందించనున్నారు. ప్రొడక్షన్ డిజైన్ అవినాశ్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్‌ను ఆంటోని ఎల్. రూబెన్ చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందిస్తుండగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి ఆడిషినల్ స్క్రీన్‌ప్లే రచయితలుగా పనిచేస్తున్నారు. భాను–నందు ద్వయం సంభాషణలను అందిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు.

# 'ది రెడ్ బ్యాగ్' టీజర్ అద్భుతంగా ఉంది..

### సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను
### టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మంత్రి టీజీ భరత్

మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హరికృష్ణ సోమిశెట్టి నిర్మాణంలో రవి కుమార్ సీరపు తెరకెక్కించిన చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ప్రతీ కంటెంట్ సినిమాపై ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. ఆదివారం నాడు 'ది రెడ్ బ్యాగ్' టీజర్‌ను ఏపీ ఇండస్ట్రీస్, కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ మినిస్టర్ టీజీ భరత్ రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంఛ్ ఈవెంట్‌లో.. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ .. ''ది రెడ్ బ్యాగ్' టీజర్ అద్భుతంగా ఉంది. మా కర్నూలు నుంచి వచ్చిన హరి గారు తీసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. మా రెడ్ బుక్ గురించి ఇండియా వ్యాప్తంగా తెలుసు. అలానే ఈ 'ది రెడ్ బ్యాగ్' మూవీ కూడా ఇండియా అంతా సౌండ్ చేయాలి. కర్నూలులోనే అత్యధిక భాగంగా షూటింగ్ చేశారు. కానీ ఫారిన్‌లో తీసినట్టుగా కనిపిస్తోంది.



సినిమా టీంకి ఆల్ ది బెస్ట్. ఈ చిత్రం మంచి విజయం సాధించి మా హరికి డబ్బులు బాగా రావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ప్రముఖ దర్శకుడు నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ .. ''ది రెడ్ బ్యాగ్' టీజర్ లాంచ్‌కు వచ్చిన టీజీ భరత్ గారికి ధన్యవాదాలు. ఇలాంటి వినూత్న చిత్రాలు తప్పకుండా విజయవంతం అవ్వాలి. హరి గారు ఈ చిత్రం హిట్ అయితే మరిన్ని కొత్త సినిమాల్ని నిర్మిస్తారు. 'ది రెడ్ బ్యాగ్' టీజర్ చూసి నేను షాక్ అయ్యాను. నెక్స్ లెవెల్లో సినిమా ఉండబోతోందని అర్థమైంది. ఈ చిత్రం కచ్చితంగా విజయం అవుతుందనే నమ్మకం ఏర్పడింది. ఇదొక ట్రెండ్ సెట్టర్‌గా నిలవాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. దర్శకుడు రవి కుమార్ సీరపు మాట్లాడుతూ .. ''ది రైడ్ బ్యాగ్' చిత్రం లైఫ్ టైం ఇంపాక్ట్ చూపిస్తుంది. ఈ మూవీ చూసిన తరువాత మీరు ఎక్కడ రెడ్ బ్యాగ్‌ని చూసినా మా 'ది రెడ్ బ్యాగ్' సినిమా గుర్తుకు వస్తుంది. నా పదహారేళ్ల నిరీక్షణ తరువాత ఈ అవకాశం వచ్చింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన హరి గారికి థాంక్స్. మాకోసం ఇక్కడకు వచ్చిన భరత్ గారికి, మాకు సపోర్ట్ చేస్తున్న మీడియాకి థాంక్స్. కథ విన్న వెంటనే హరి గారు ఓకే చెప్పేశారు. మా సినిమాకి కథే హీరో. కర్నూలులో చాలా వరకు రెక్కీ చేశాం. దాదాపు షూటింగ్ అంతా అక్కడే చేశాం. కంటెంట్ బాగుంటే ఆడియెన్స్ హిట్ చేస్తారు. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు న్యాయం చేసేలా మా 'ది రెడ్ బ్యాగ్' సినిమా ఉంటుంది.' అని అన్నారు. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి మాట్లాడుతూ .. ''ది రెడ్ బ్యాగ్' సినిమాకి సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మూవీ చాలా బాగా వచ్చింది. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. త్వరలోనే మూవీ రిలీజ్ కాబోతోంది. అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

# నమ్మకం భయంగా మారినప్పుడు.. నిజం కోసం అన్వేషణ ప్రారంభమవుతుంది.

తెలుగు టాప్ ఓటీటీ ప్లాట్ ఫామ్ ZEE5 ప్రేక్షకుల ముందుకు ఒక థ్రిల్లింగ్ మిస్టరీ కథను తీసుకురాబోతోంది. అదే 'మర్మదేశం అనే ప్రపంచం నుంచి 'వీరభద్రుని రహస్యం'. ఇది జూన్ 26 నుంచి జీ5లో ప్రీమియర్ కానుంది. 1990ల్లో టెలివిజన్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ కల్ట్ మిస్టరీ సిరీస్ మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. అలాగే తెలుగు ఐఎండీబీ హయ్యస్ట్ రేటింగ్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. రహస్యాలతో నిండిన వీరభద్రపురం అనే గ్రామ నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌లో.. నమ్మకం ఆజ్ఞలను విధించే శక్తిగా మారి..భయం ప్రతి రోజూ అక్కడి ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తుంది. దేవుడిపై ఉన్న గాఢ విశ్వాసం నీడలో దాగి ఉన్న ఎన్నో రహస్యాలు ఈ కథలో వెలుగులోకి రాబోతున్నాయి. కథ విషయానికి వస్తే.. తరతరాలుగా వీరభద్రపురం గ్రామ ప్రజలు తమ గ్రామ దైవం వీరభద్ర స్వామి అండలో జీవిస్తుంటారు. గ్రామాన్ని కాపాడే ఆ దేవుడు.. అదే గ్రామంలో ఎవరైనా తప్పు చేస్తే ఆయన శిక్షిస్తాడని అందరూ గాఢంగా నమ్ముతుంటారు. ఆ ఆలయంలోని పవిత్ర గంట మోగినప్పుడల్లా..ఆలయ పరిసరాల్లో ఓ మృతదేహం కనిపిస్తుంది. గద్దల గుట్టగా శపించబడిన కొండపై మృతదేహాలు కనిపిస్తుంటాయి. ఈ మరణాలను గ్రామస్తులు దైవ న్యాయంగా భావిస్తుంటారు. అయితే వాటి వెనుక నిజం ఏమిటో అని మాత్రం ప్రశ్నించడానికి ఎప్పుడూ ధైర్యం చేయరు. తరతరాలు వారందరూ పాటిస్తున్న సాంప్రదాయం వారిని స్వామికి విధేయులుగా ఉంటూ మౌనంగా కొనసాగేలా చేస్తుంది. దీంతో వారు బలవంతంగా, దశాబ్దాలుగా అక్కడి ప్రజలు ఆ సాంప్రదాయాన్ని పాటిస్తుంటారు. మూఢనమ్మకాలతో నిండిన వింత ప్రపంచలాంటి వీరభద్రపురం అనే ప్రపంచంలోకి సిటీ నుంచి ధైర్యమైన, విషయాన్ని తార్కికంగా ఆలోచించే యువతి వెన్నెల ( అన్నీ ) అడుగుపెడుతుంది. ఆమె వచ్చిన సమయంలో గ్రామంలో ఓ యువ గ్రామస్తుడు దారుణంగా హత్యకు గురవుతాడు. అయితే అక్కడి ప్రజలు దాన్ని దైవ శిక్షగా చెబుతారు. కానీ వెన్నెల మాత్రం వారి అంధ



విశ్వాసాన్నిఒప్పుకోదు. నిజాన్ని వెలికితీయాలనే ఆమె సంకల్పం గ్రామాన్ని కుదిపేస్తుంది, శతాబ్దాలుగా ఉన్న నమ్మకాల్ని సవాలు చేస్తుంది, గతాన్ని దాచిపెట్టాలని చూసే శక్తివంతులైన వ్యక్తులతో ఆమె పోరాటాన్ని ప్రారంభిస్తుంది. వెన్నెల లోతుగా అన్వేషణ చేసుకుంటూ వెళ్లే కొద్దీ.. గ్రామంలోని రహస్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతుంటాయి. భక్తి పేరుతో దాగి ఉన్న దోపిడీ, వ్యవస్థీకృత నేరాలు, తరతరాల భయాల వెనుక దాచిన చీకటి గతం బయటపడుతుంది. 1970ల కాలానికి వెళ్లి ఈ ఘటనల మూలాలను అన్వేషించటం ద్వారా ఈ గ్రామాన్ని నడిపిస్తున్న కథలు ఎలా శక్తి, ఆశ, మాయాజాలంతో రూపుదిద్దుకున్నాయో సిరీస్ నెమ్మదిగా బయటపెడుతుంది. ఇది విశ్వాసం, తర్కం మధ్య జరిగే గట్టిపోరు. ప్రతి సమాధానం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతుంది, ప్రతి నిజం బయటపడే కొద్దీ ఎవరూ ఊహించని వాస్తవాలు బయటకు రాబోతున్నాయనే ఉత్కంఠత పెరుగుతుంది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 68-5-1/1,Near Municipal Complex , Patamata,N.T.R , Andhra Pradesh-520010 .Editor : Sudheer kumar katepally ph: 9000657700, PRGI NO: APTEL/26/A2264